# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

## తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 26 డిసెంబరు 2024 | 5




రాజమహేంద్రవరంలోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు



## క్రీస్తు రాకడ కోసం..

రక్షకుడు ఉదయించినాడట.. మన కొరకు పరమ రక్షకుడు ఉదయించినాడట.. అంటూ బుధవారం ఉదయం నుంచి ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా చేసుకున్నారు.. విశ్వాసులు పెద్ద ఎత్తున చర్చిలకు హాజరై పార్థనలు చేశారు.. నాయకులు ప్రార్థనాల్లో పాల్గొన్నారు. మాకోసం రావయ్యా ఏసయ్యా అంటూ ప్రభువును పిలిచారు..కొవ్వొత్తులు పట్టుకుని వీధుల వెంట పెద్ద ఎత్తున ర్యాలీలు చేశారు.. హ్యాపీ క్రిస్మస్..మెర్రీ క్రిస్మస్ అంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ జిల్లా అంతటా ఆనందంగా గడిపారు. - 8లో




రాజమహేంద్రవరంలోని చర్చిల్లో పాస్టర్ల ప్రార్థనలు



జ్యోతి వెలిగించి క్రిస్మస్ శుభాకాంక్షలు చెబుతున్న కలెక్టర్ ప్రశాంతి.. కోరుకొండలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



కోరుకొండ మండలంలో బరకాలు కప్పి ఉంచిన ధాన్యం

## చల్లబడిన వాతావరణం

### ఆందోళనలో రైతాంగం

రాజమహేంద్రవరం సిటీ/కోరుకొండ డిసెంబర్ 25(ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు వరి కోతలు నిలిపివేశారు. దీంతో పక్వానికి వచ్చిన వరి ధాన్యం నేలరాలిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరి కోతలు కోసి కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యం గత మూడు రోజులుగా కురిసిన ముసురు వర్షాలకు తడిసి ముద్దయింది.దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.జిల్లాలో గడచిన 24 గంటల్లో 15 మండలాల్లో 32.4 శాతం వర్షపాతం నమోదైంది. బిక్కవోలులో అత్యధికంగా 4.2 మి.మీ వర్షపాతం నమోదైంది. గోకవరం,సీతానగరం మండలాల్లో అత్యల్పంగా 1 మి.మీ వర్షం పడింది. నల్లజర్లలో 3.2 మి.మీ, కోరుకొండలో 3.2, దేవరపల్లిలో 2.8 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 2.8 మి.మీ,తాళ్ళపూడిలో 2.6 మి.మీ, రాజమహేంద్రవరంలో 2.4 మి.మీ, గోపాలపురంలో 1.8 మి.మీ, చాగల్లులో 1.8 మి.మీ, కడియంలో 1.8 మి.మీ అనపర్తిలో 1.4 మి.మీ, నిడదవోలులో 1.2, కొవ్వూరులో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.వాతావరణం పూర్తిగా చల్లబడింది. చలికాగాలి తీవ్రత కూడా పెరిగింది.




పండుగకు వెళ్లాలి ఎలాగైనా.. ఇదీ ప్రతి ఒక్కరి ఆశ.. ఈ ఆశనే కొందరు క్యాష్ చేసుకుంటారు.. ప్రతి ఏడాది ఇంతే.. ఈ ఏడాది జరుగుతున్నది ఇదే.. హైదరాబాద్.. బెంగళూరు.. చెన్నై.. పుణె ఇలా ఏ పెద్ద నగరంలోనైనా గోదావరి జిల్లాల వాళ్లు ఉండకుండా ఉండరు.. వీళ్లంతా కుటుంబంతో కలిసి ప్రతి ఏడాది పండుగకు వస్తారు.. స్వగ్రామాల్లో ఆనందంగా గడిపి వెళ్లిపోతారు.. ప్రస్తుతం అక్కడి నుంచి రావడమే గగనంగా మారింది.. పండుగకు సుమారు మూడు వారాలున్నా ధరలు పెంచేశారు.. రైళ్లు.. బస్‌లు.. విమానాలు.. ఏవి చూసినా అంతే.. అప్పుడే ధరలు అదరగొట్టేస్తున్నాయి..

## పండుగకు ఊరొచ్చేదెలాగో..

- పండుగ బాదుడే..బాదుడు
- బస్సులు,రైళ్ల టిక్కెట్ల ధరలు ఫుల్
- విమాన చార్జీలకు రెక్కలు
- హైదరాబాద్ నుంచి రూ.7,500
- బెంగళూరు నుంచి రూ.8 వేలు
- రోజుకు ఆరు ఇండిగో సర్వీసులు
- అప్పుడే సగానికిపైగా టికెట్లు ఫుల్
- బస్సు చార్జీలు పెంచేశారు
- ఏసీ స్లీపర్ టిక్కెట్లు రూ.3,900
- పిండేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్
- అన్ని ట్రైన్లలోను రిగ్రెట్
- గోదావరివాసులకు పండగ షాక్

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండగకు ఊరు రావాలనుకునే వారికి అప్పుడే టికెట్ చార్జీలు షాక్ కొడుతున్నాయి. విమాన టిక్కెట్ల నుంచి బస్సు, రైలు టికెట్లు చుక్కలు చూపిస్తున్నాయి. అడ్డగోలుగా రేట్లు పెంచేసి అప్పుడే ఆయా ట్రావెల్స్ ప్రయాణికుల జేబులు గుల్ల చేసేస్తున్నాయి. దీంతో ఎక్కడెక్కడి నుంచో పండగకు ఊరొద్దామని ఆశపడే వారికి ప్రయాణం ప్రయాసగా మారిపోయింది. ప్రధానంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంతోపాటు అనేక పట్టణ ప్రాంతాలకు చెందినవారు వ్యాపార, ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో అధికంగా స్థిరపడ్డారు. బెంగళూరు, చెన్నైతోపాటు అనేక ప్రాంతాల్లోను ఉమ్మడి జిల్లా వాసులు వివిధ అవసరాలరీత్యా ఉంటున్నారు. వీరంతా ఎలాగైనా పెద్ద పండగకు ఊరు రావాల్సిందే. అయితే పండగ దగ్గరపడడం, ఇంకా మూడు వారాలు కూడా లేకపోవడంతో సొంతూరుకు రావడానికి టికెట్లు బుక్ చేసుకోవడానికి ప్రయత్నిస్తే చార్జీలు షాక్ కొట్టేస్తున్నాయి. పండగకు రావడమే కాదు.. తిరుగు ప్రయాణం టిక్కెట్లు సైతం అప్పుడే వేలల్లోకి ఎగబాకి చుక్కలు చూపించేస్తున్నాయి. విమానం, రైలు, బస్సు వేటి ధరలు చూసినా బెంబేలెత్తిస్తున్నాయి.

### ప్రైవేట్ ట్రావెల్స్ బాదుడు..

పండగకు కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ జిల్లాలకు చెందిన అనేకమంది హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి భారీగా స్వగ్రామాలకు ముందే చేరుకుంటారు. దీంతో అనేక మంది బస్సు టిక్కెట్లకు ప్రయత్నిస్తుంటే చార్జీలు గూబగుయ్‌మనేలా చేస్తున్నాయి. ప్రధానంగా ప్రైవేటు ట్రావెల్స్ అయితే చుక్కలు చూపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో ఏసీ స్లీపర్ బస్సు చార్జీలు హైదరాబాద్ నుంచి కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురానికి రూ.1,099 నుంచి రూ.1,100 వరకు ఉండగా పండగా పేరుతో ఏకంగా రూ.3,990 వరకు పిండేస్తున్నాయి. ప్రధానంగా హైదరాబాద్ నుంచి కాకినాడ, రాజమహేంద్రవరానికి సుమారుగా 12కిపైగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు రోజుకు 50కిపైగా సర్వీసులు నడుస్తాయి. పండగకు వీటిని దాదాపు 70 వరకు పెంచాయి. వీటిలో ఇప్పుడు పండగ చార్జీలు రూ.3,200 నుంచి రూ.3,900 వరకు వసూలు చేస్తున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే సాధారణ రోజుల్లో చార్జీలతో పోల్చితే మూడు రెట్లు పెంచేశారు. వాస్తవానికి ఇప్పుడు శీతాకాలం నేపథ్యంలో బస్సుల్లో ఏసీ చార్జీలను తగ్గించాలి. కానీ సంక్రాంతి పండగ పేరుతో అడ్డంగా బాదేస్తున్నాయి. అయితే పండగ దగ్గరపడితే ఈ చార్జీలు రూ.5వేలకుపైగా ఎగబాకినా ఆశ్చర్యపోనవసరంలేదు. మరోపక్క ఈ రూట్లో ఆర్టీసీ బస్సులు నాన్‌ఏసీ కేటగిరీలో రూ.770 వరకు వసూలు చేస్తున్నా చాలావరకు సీట్లు నిండిపోయాయి. ఇదిలా ఉండగా హైదరాబాద్ నుంచి కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలతోపాటు అమలాపురం పట్టణానికి ఆర్టీసీ వచ్చే నెల 9,10,11,12 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడుపుతోంది. వీటిలోనూ చాలావరకు సీట్లు నిండిపోయాయి.

### రైళ్లన్నీ రిగ్రెట్..

హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం, సామర్లకోటకు రోజుకు దాదాపు 17 రైళ్లు నడుస్తుంటాయి. ఎక్కువమంది పండగకు రైళ్లలో రావడానికి ప్రయత్నిస్తారు. కానీ సంక్రాంతి నేపథ్యంలో వీటిలో సీట్లన్నీ నిండిపోవడంతోపాటు ఏకంగా రిగ్రెట్ చూపిస్తోంది. ఎన్ని రైళ్లు రద్దీగా ఉన్నా కొంతకాలం కిందట ప్రవేశపెట్టిన వందే భారత్ రైళ్లలో సీట్లు కొంతవరకు ఎప్పుడూ ఖాళీగా ఉంటాయి. కానీ పండగ రద్దీ నేపథ్యంలో వీటికి కూడా సీట్లు రిగ్రెట్ చూపిస్తున్నాయి. ప్రధానంగా వచ్చే నెల 9 నుంచి అయితే అసలు వెయిటింగ్ లిస్ట్ కాదు కదా అవి కూడా నిండిపోయి రిగ్రెట్ దశకు వచ్చేశాయి. విశాఖ ఏసీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నుంచి గరీబ్‌రథ్, గోదావరి, ఫలక్‌నుమా, జన్మభూమి, గౌతమి, ఈస్ట్‌కోస్ట్, విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ పూర్తిగా రద్దీగా మారి రిగ్రెట్ చూపిస్తున్నాయి. దీంతో జనం సొంతూళ్లకు రావడానికి నానా తంటాలు పడాల్సిన పరిస్థితి. విమానాల దగ్గర నుంచి బస్సులు, రైళ్లు ఎక్కడికక్కడ సీట్లన్నీ అప్పుడే ఫుల్ అయిపోయాయి. అటు దగ్గరచేసి తత్కాల్‌లో టికెట్లు తీసుకుందామన్నా బాదుడు మామూలుగా లేదు. దీంతో చాలామందికి దిక్కుతోచడం లేదు.

### ఎగరాలంటే జేబులు గుల్లే..

ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాలకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు ఎక్కువగా జనం వస్తుంటారు. ప్రస్తుతం చాలామంది వేగంగా రావడం కోసం విమానాలపైనే ఆధారపడుతున్నారు. తీరా ఇప్పుడు వీటి చార్జీలు ఆకాశాన్నంటేశాయి. ప్రధానంగా వచ్చే నెల 13 నుంచి భోగి పండగ మొదలు కానుంది. ఈ మేరకు ముందుగానే జనం టిక్కెట్లకు ప్రయత్నిస్తుంటే వేలకు వేలు పిండేస్తున్నారు. ప్రధానంగా హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవ రానికి ఇండిగో సంస్థ రోజుకు ఆరుకుపైగా సర్వీసులు నడుపుతోంది. సాధారణ రోజుల్లో ఫ్లైట్ టికెట్ ధర రూ.3,999 వరకు ఉంటోంది. కానీ సంక్రాంతి పండగ పేరుతో అప్పుడే ఇండిగో చార్జీలు ఆకాశన్నంటేశాయి. ప్రధానంగా జనవరి 7న హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి ఫ్లైట్ టిక్కెట్ ఒకరికి రూ.4,510 ఉంది. జనవరి 8న రూ.5,350, 9న రూ.6,190, 7న రూ.7,135, 8న రూ.5,350, 9న రూ.6,190, 10న రూ.7,135, 11న రూ.7,765 12న రూ.6,610, 13న రూ.4,510వరకు వసూలు చేస్తోంది. అయితే పండగకు ఇంకా రెండువారాలకు పైగా సమయం ఉండడంతో ఇప్పుడే ఈ ధరలు షాక్ కొడుతుండగా.. సమయం దగ్గర పడేకొద్దీ ఈ చార్జీలు రూ.14 వేలకుపైగా ఎగబాకనున్నాయి. అటు పండగ ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణం అయ్యే వారికి సైతం చార్జీలు దడ పుట్టిస్తున్నాయి. ప్రధానంగా జనవరి 16 నుంచి ఏకంగా అప్పుడే టికెట్ చార్జీలు రూ.9,700కు ఎగబాకేశాయి. వ్యవధి దగ్గరపడే కొద్దీ ఛార్జీలు రూ.16 వేలకుపైగా ఉండే అవకాశం ఉంది. అటు బెంగళూరు నుంచి రాజమహేంద్రవరం సాధారణ రోజుల్లో ఇండిగో చార్జీలు రూ.3,999 కాగా పండగ పేరుతో అప్పుడే రూ.7,800 వరకు పిండేస్తోంది. ప్రధానంగా ఈ రూట్లో రోజూ నడిచే ఆరు సర్వీసుల్లో వచ్చే జనవరి ఏడవ తేదీన టికెట్ చార్జీ రూ.5,983 కాగా 8న రూ.7,095, 9న రూ.7,020, 10న రూ.8,265, 11న రూ.7,851, 12న రూ.7,851 13వ తేదీన రూ.6,412 వరకు ఉంది.




రండి బాబూ రండి.. మంచి తరుణం మించిన దొరకదు.. పండుగ ఆఫర్.. మీకోసమే.. ఒకటి కొనండి.. మరొకటి ఉచితంగా తీసుకెళ్లండి.. ఈ ఒక్క మాట చాలు.. అంతే జనం ఎగబడిపోతున్నారు.. ఎందుకిస్తారు..ఎలా ఇస్తారు.. అనేది కనీసం ఆలోచించడంలేదు.. ఫ్రీ అంటే పెనాయిల్ అయినా తాగేస్తారనే నానుడిని నిజం చేస్తున్నారు.. ఉభయ గోదావరి జిల్లాలకు రాజమహేంద్రవరమే ప్రధాన వాణిజ్య పట్టణం.. పండుగ షాపింగ్‌కు ఎక్కడి నుంచైనా ఇక్కడికే వస్తారు.. ఇదే అదునుగా వ్యాపారులు కొనుగోలుదారుల ఆశను క్యాష్ చేసుకుంటున్నారు.. ఆఫర్ల పేరుతో వల వేసి తమ షాపులోకి లాగేస్తున్నారు.. నాణ్యతలేని దుస్తులను ఆఫర్ల పేరుతో అంటగట్టేసి జేబులు గుల్ల చేస్తున్నారు.. కొత్త స్టాక్ అయితే మాత్రం తగ్గేదేలే..

## ఊదరగొడుతున్న పండుగ ఆఫర్లు

- ఫ్రీ అంటే ఎగబడుతున్న జనం
- రూటు మార్చిన వ్యాపారులు
- ప్రతి షాపు వద్ద హోర్డింగ్‌లు
- రాజమండ్రి వైపు అందరి చూపు
- నెల రోజులుగా పెరిగిన వ్యాపారం
- కోట్లాది రూపాయల లావాదేవీలు
- కిక్కిరిసిపోతున్న మార్కెట్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఫ్రీ..ఫ్రీ..ఫ్రీ..ఎటు చూసినా ఇవే హోర్డింగ్‌లు.. ఏ షాపు వద్ద చూసినా పెద్ద ఎత్తున ఆఫర్లు.. ఒకటి కొంటే రెండు ఉచితం.. రెండు కొంటే నాలుగు ఉచితం.. ఎంత కొంటే అంతా ఫ్రీ..ఇలా అంటేనే జనం ఎగబడుతున్నారు.. ఆ బోర్డులు చూసి లోపలకు వెళ్లారా.. అక్కడంతా మోసమే.. అసలు..నకిలీ సినిమాలా ఉంటుంది.. ఆఫర్లకు ఇచ్చే దుస్తులు ఒకటి.. ఎమ్మార్పీ ధరలపై విక్రయించే దుస్తులు ఒకటి.. తీరా షాపు లోపలకు వెళ్లిన తరువాత ఏదో ఒకటి కొని తెచ్చుకోవాలని.. జేబు ఖాళీ చేసుకుంటున్నారు.

### వ్యాపారులకు పెద్ద పండుగ..

గోదావరి జిల్లాలకు ప్రముఖ వాణిజ్య కేంద్రం రాజమహేంద్రవరం..ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి రాజమహేంద్రవరం మార్కెట్‌కు పెద్ద ఎత్తున కొనుగోలుదారులు తరలివస్తుంటారు. ఇదే అదునుగా వ్యాపార సంస్థలు క్రిస్మస్, న్యూ ఇయర్,సంక్రాంతిలను పురస్కరించుకుని ఆఫర్లపై ఆఫర్లతో ఊదరగొతున్నాయి.పండగ పేరు చెబితే చాలు గోదావరి జిల్లాల్లో ఎక్కడ లేని ఉత్సాహం వస్తుంది.. క్రిస్మస్, పెద్ద పండుగ అంటే వదిలేది లేదు.వేలకు వేలు ఖర్చు చేసి షాపింగ్ చేస్తుంటారు.నెలరోజుల ముందు నుంచి సందడి చేస్తారు. ప్రతి ఏటా డిసెంబరు ఒకటో తేదీ నుంచి వ్యాపారం ఆరంభమైపోతోంది.ఇదే అదునుగా వ్యాపారులు క్యాష్ చేసు కుంటున్నా రు. 50 రోజుల్లోఒక్క రాజమహేంద్రవరంలోనే రూ.వెయ్యి కోట్ల వ్యాపారం జరుగుతుందంటే అతిశయోక్తి కాదు.రాజమహేంద్రవరంలో బట్టల షాపులు సుమారు 800 వరకూ ఉంటాయి. జిల్లా మొత్తం అయితే 1200 ఉంటాయి. బంగా రం దుకాణాలు రాజమహేంద్రవరంలోనే 500 వరకూ షాపులు ఉంటాయి.జిల్లాలో లెక్కవేస్తే సుమారు 700 వరకూ ఉండొచ్చు.ఇవి గాక మాల్స్ షూమార్ట్‌లు 200 వరకూ ఉంటాయి. పండుగ వస్తుందంటే ఈ మూడింటికి డిమాండ్ ఎక్కువే.దీంతో వ్యాపారులు భారీ ఆఫర్లు పెట్టి క్యాష్ చేసుకుంటున్నారు.

### కొనుగోలుదారుల క్యూ

రాజమహేంద్రవరం అంటే వస్త్రాలు, గోల్డ్, సిల్వర్ ఇలా ఒకటేమిటి.. వ్యాపారాలకు అంతే లేదు. పెద్ద పెద్ద మాల్స్, కంపెనీ దుకాణాలు.. ఏది కావాలంటే..ఎంతలో కావాలంటే అంతలో కావాల్సిన వస్తువులు లభ్యమవుతాయి.దీంతో ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచే కాకుండా ఇటు శ్రీకాకుళం,అటు విజయవాడలో స్థిరపడిన గోదావరి జిల్లా ప్రజలు షాపింగ్‌కు వస్తారు. అందుకే డిసెంబర్ మొదలుకొని, జనవరి పండగ వరకూ ఇక్కడ వ్యాపారాలు పెద్ద ఎత్తున జరుగుతాయి. డిసెంబరు నుంచి జనవరి మూడో వారం వరకు వ్యాపారం తారాస్థాయిలో ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని వ్యాపార సంస్థలు పోటాపోటీగా ఆఫర్లు ప్రకటిస్తున్నాయి.డిస్కౌంట్లు ఇచ్చేస్తున్నాయి.ఒకటి కొంటే ఒకటి ఉచితం,రూ.2 వేల విలువైంది రూ.999లకే, టీ షర్టులు రూ.200, రూ.3 వేల చీర రూ.వెయ్యిలకే, రూ.10 వేలు కొనుగోలుపై 30 శాతం, కొన్ని రకాల వస్త్రాలపై 70 శాతం, ఎంత కొంటే అంతా ఫ్రీ..బంగారు అభరణాలపై తరగు మజూరి రాయితీ లు, వెండి,బంగారు క్వాయిన్లు గిఫ్ట్,గ్రాముకు రూ.300 తగ్గింపు ఇలా ఆఫర్లు,ఎలక్ట్రానిక్స్ గూడ్స్‌పై 30 నుంచి 50 శాతం వరకు డిస్కౌంట్లు ఇలా ప్రతి వస్తువుపై ఆఫర్లు పెట్టి వినియోగదారులకు వ్యాపార సంస్థలు వల వేస్తున్నాయి.పండగల ఆఫర్లకు ఎదురుచూసే వారుండడంతో ప్రస్తుతం వ్యాపారం కుమ్మేస్తున్నారు.ఎందుకంటే కొను గోలుదారులు చవక అంటే పరుగులు తీస్తారు.ఒక వ్యాపారి మాట్లాడుతూ 50 రోజుల పాటు జరిగే వ్యాపారంతోనే రాజమహేంద్రవరంలో ఏడాదంతా నడుస్తాయని చెప్పడం కొసమెరుపు.రాజమహేంద్రవరంలో సుమారు వెయ్యి కోట్ల వ్యాపారం సాగుతుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇతర ప్రాంతాల నుంచి రాజమహేంద్రవరం మా ర్కెట్‌కు వచ్చే వారి కార్లతో పుష్కరాలరేవు నుంచి గోదావరి బండ్ రోడ్డు నిండిపోతుందంటే ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### డిస్కౌంట్ వెనుక..

చీరలు, చిల్డ్రన్ వస్త్రాలు, షూస్, చెప్పల్స్, ఇతర పరికరాలు పండగల సమయంలో ఆఫర్లలో విక్రయిస్తుంటారు.వాటిని ప్రజలు తక్కువకు వస్తుందని కొనుగోలు చేస్తారు. ఇది ప్రతి ఏడాది జరిగే ప్రక్రియే.ఎమ్మార్పీ రూ.2 వేల చూపించి రూ.500లకే ఇచ్చేస్తారు. ధరలో అంత వ్యత్యాసం ఎలా ఉంటుంది.వ్యాపారుడు ఏమైనా మన తాతా.. బంధువా..లేదంటే అన్నా తక్కువక ఇవ్వడానికి. దిగుమతి అయ్యే ఖర్చు కంటే ఆఫర్ ఎలా సెట్ అయ్యిందంటే దానికి కొంత మంది నిష్ణాతు లు ఇలా చెబుతున్నారు. వస్తువు తయారీకి అయ్యే ఖర్చుపై ఎట్టి పరిస్థితుల్లోను మార్జిన్ అమౌంట్ వేసుకోకుండా విక్రయాలు జరగవు.. ఆఫర్ ఇచ్చిన వస్తువు స్టాక్ లేకుండా విక్రయాలు చేస్తే పెట్టుబడిపై వంద శాతం లాభం వస్తుంది అదే ఆలస్యం అయ్యే కొద్దీ లాభం తగ్గించుకుని అంటే రూ.100 వచ్చే చోట రూ.60 వచ్చేలా ప్లాన్ చేసుకుని డిస్కౌంట్ ఆఫర్లు పెడతారనేది నమ్మశక్యం కాని నిజం. పెద్ద ఎత్తున స్టాక్ మిగిలిపోయిన వస్తువులకు ఆఫర్లు ఇచ్చి సరుకును తోసేస్తారట.. ఎంత ఆఫర్ ఇచ్చినా కంపెనీలకు గిట్టుబాటు అవుతుందనే చెబుతున్నారు. ముంబై, సూరత్ తదితర ప్రాంతాల నుంచి తక్కువ ధరలకు సరుకును దిగుమతి చేసుకుని దానిపై పది రెట్లు మార్జిన్ వేసుకుని వ్యాపారాలు చేస్తుంటారు. అందువల్ల ఆఫర్లు విచిత్రంగా ఉంటాయి.ఒకటి కొంటే మరొకటి ఉచితమంటే కాస్త ఆలోచించాల్సిందే మరి..

## ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు తత్కాల్ అడ్మిషన్లు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో అడ్మిషన్లకు గురువారం నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు అవకాశం ఇచ్చినట్టు ఏపీ సార్వత్రిక విద్యాపీఠం సంచాలకులు తెలిపారు. ఈ మేరకు డీఈవో వాసుదేవరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక పీఠం అమరావతి ఆధ్వర్యంలో అడ్మిషన్లు స్వీకరిస్తారన్నారు. సాధారణ అడ్మిషన్ ఫీజులకు అదనంగా తత్కాల్ ప్రవేశ రుసుం రూ.600 చెల్లించాలన్నారు. విద్యార్థులు తత్కాల్ గడువు ఉపయోగించుకుని ప్రవేశం పొందాలన్నారు. మరిన్ని వివరాలకు కోటగుమ్మం వద్ద గల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.


బీజేపీలో చేరిన కంబాల
కండువా కప్పిన పురందేశ్వరి

వివాహితను కాపాడిన
మహిళా రక్షక్ టీం

కాకినాడలో
మహిళ హత్య 7




కొనుగోలుదారులతో బుధవారం కిక్కిరిసిన రాజమహేంద్రవరం మెయిన్ మార్కెట్

## 16అంగుళాల పుంగనూరు గిత్త జననం



కరప మండలం జడ్.బావారంలో పుంగనూరు గిత్త

కరప, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం జడ్.బావారం గ్రామంలో 16అంగుళాల ఎత్తున్న పుంగనూరు గిత్తదూడ పుట్టి చూపరులకు కనువిందు చేస్తోంది. గ్రామానికి చెందిన పాడి రైతు కంచెర్ల నాగేశ్వరరావు గోవుల మందలోని ఒక ఆవుకు బుధవారం రెండో ఈతగా ఈ గిత్తదూడ పుట్టింది. కేవలం 16అంగుళాల ఎత్తు, 36 అంగుళాల పొడవు, 4 కిలోల బరువున్న ఈ తెల్లటి గిత్తదూడను చేసేందుకు గ్రామస్తులు క్యూ కడుతున్నారు. గత అక్టోబరులో ఇదే రైతుకు చెందిన కర్రిరంగు పుంగనూరు ఆవుకు ఇదే సైజులో ఉన్న గిత్తదూడ పుట్టడం గమనార్హం.

## వివాహితను రక్షించిన మహిళా రక్షక్ టీం

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుందామని రాజమహేంద్రవరం వచ్చిన ఒక వివాహితను తూర్పుగోదావరి జిల్లా మహిళా రక్షక్ టీం రక్షించింది. రాజమహేంద్రవరం గౌతమీ ఘాట్ వద్ద మంగళవారం రాత్రి మండపేటకు చెందిన ఒక వివాహిత ఏడుస్తూ మహిళా రక్షక్ టీంకు కనిపించింది. వెంటనే వారు ఆమె వివరాలు సేకరించారు. వివాహం జరిగి ఎనిమిదేళ్లు అయిందని.. ఇద్దరు పిల్లలు ఉన్నారని.. తన భర్త వేధింపులు తాళలేక చనిపోదామని రాజమహేంద్రవరం వచ్చానని తెలియజేసింది. దీంతో స్పందించిన రక్షక్ టీం ఎస్పీ నరసింహకిషోర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు స్టేషన్‌కు తరలించి రక్షక్ టీం ఇన్‌చార్జి వివాహిత భర్త, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బుధవారం వారిని స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆమెను కుటుంబీకులకు అప్పగించారు. వివాహితను రక్షించిన రక్షక్‌టీంను ఎస్పీఅభినందించారు.

## జేఎన్టీయూకేలో.. వాక్ విత్ నేషన్స్

» 194 ప్రపంచ దేశాల జాతీయ పతాకాల ఆవిష్కరణ
» కార్యక్రమంలో పాల్గొన్న వీసీ మురళీకృష్ణ, రెక్టార్ రమణ
» అక్షర క్రమంలో ఆయా దేశాల జాతీయ జెండాల ఏర్పాటు
» దేశంలోని వర్సిటీల్లో ఏర్పాటు చేయడం ఇదే ప్రథమం





జేఎన్‌టీయూకే పరిపాలనా భవనం వద్ద ఏర్పాటు చేసిన 194 ప్రపంచ దేశాల జాతీయ పతాకాలు... ఏర్పాటుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకే ప్రాంగణంలో పూర్వ విద్యార్థి సుందర్ అసోసియేట్స్ చైర్మన్ డాక్టర్ బాదం సుందరరావు సహకారంతో విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంవద్ద భిన్నత్వంలో ఏకత్వం అనే నానుడిని స్ఫూర్తిగా తీసుకుని వాక్ విత్ నేషన్స్ పేరుతో ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన 194 ప్రపంచదేశాల జాతీయ పతాకాలను ఏర్పాటుచేశారు. జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ బుధవారం ఆ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రధాన కేంద్రమైన స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉన్న 194 ప్రపంచ దేశాల జాతీయ పతాకాలను ఆదర్శంగా తీసుకుని భారతదేశంలోని విశ్వవిద్యాలయాల్లో మొదటిగా జేఎన్టీయూకేలో ప్రపంచదేశాల జాతీయ జెండాలను ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.

### ప్రపంచంలో ఆరోది..

ప్రపంచంలో జెనీవా, అమెరికాలోని న్యూయార్క్, దక్షిణకొరియాలోని సియోల్, చైనాలోని షాంగై, డొమినికన్ రిపబ్లిక్‌లోని శాంటో డొమింగోలో ప్రపంచ దేశాల జాతీయ జెండాలను ఏర్పాటు చేశారని, ఆరోది కాకినాడ జేఎన్టీయూకేలో ఏర్పాటు చేశామని వీసీ తెలిపారు. వసుధైక కుటుంబం అనేది దీని ముఖ్య ఉద్దేశ్యమని, అన్ని దేశాల జాతీయ పతాకాలు ఒకే చోట ఉండడం ద్వారా కలిగే అనుభూతి చెప్పలేనిదని అన్నారు. భూమిలోని సకల జీవరాశులు ఒక కుటుంబంగా భావిస్తారని, అందుకే ఇక్కడ ప్రపంచ దేశాల జాతీయ పతాకాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

### అక్షర క్రమంలో..

ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన 194 ప్రపంచ దేశాల జాతీయ పతాకాలు అక్షర క్రమంలో ఉంటాయని, ప్రతి జెండా స్తంభానికి క్యూ ఆర్ కోడ్‌తో కూడిన డిస్‌ప్లేను ఉంచారు. దీని ద్వారా ఆ దేశ జనాభా, రాజధాని, కరెన్సీ తదితర పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.వర్సిటీ అనుబంధ కళాశాలలతోపాటు జిల్లాలోని ప్రతి పాఠశాల, సంస్థ జేఎన్టీయూకేను సందర్శించి ఫొటోలు తీసుకోవడాన్ని గర్వంగా భావించడంతో పాటు విజ్ఞాన, పర్యాటక ప్రదేశంగా మారబోతుందన్నారు. వాక్ విత్ నేషన్స్ అనే ప్రపంచ పౌరసత్వం స్ఫూర్తిని ప్రతిబింబించే ప్రాజెక్ట్ అని, ఈ ఐకానిక్ ప్రదర్శన మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీరమణ, ఓఎస్డీ కోటేశ్వరరావు, సీఈ శ్రీనివాసులు, మాజీ వీసీలు జీవీఆర్ ప్రసాదరాజు, కె.పద్మరాజు, బాదం సుధారాణి పాల్గొన్నారు.



## నలుగురు మత్స్యకారులూ సురక్షితం

» ఒడ్డుకు చేర్చిన కోస్ట్‌గార్డ్, మెరైన్ బృందాలు

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): నడి సముద్రంలో చిక్కుకున్న నలుగురు మత్స్యకారులను కోస్ట్‌గార్డ్, మెరైన్ బృందాలు రక్షించాయి. కాకినాడ పర్లోవపేటకు చెందిన వాడమొదలు ధర్మరాజు, వాడమొదలు పెంటయ్య, మల్లాడి నాని, మల్లాడి సతీష్ చేపల వేటకోసం బోటులో ఈ నెల 23న బయల్దేరారు. భైరవపాలెం మీదుగా 26 నాటికల్ మైళ్లదూరం వెళ్లారు. తుఫాను ప్రభావంతో సముద్రం అలకల్లోలంగా లోపల చిక్కుకున్నారు. కాకినాడ జిల్లా మత్స్యశాఖ అధికారి వారిని రక్షించాలని ఇండియన్ కోస్ట్‌గార్డ్‌ను కోరారు. వెంటనే కోస్ట్‌గార్డ్, మెరైన్ బృందాలు ఐసీజీఎస్ కనక్లత్ బారువా అనే పెట్రోలింగ్ నౌకలో బుధవారం తెల్లవారుజామున 5.30గంటలకు వెళ్లి నలుగురినీ కాకినాడ హార్బర్‌కు తీసుకొచ్చాయి.కోస్ట్‌గార్డుతోపాటు రిలయన్స్‌ఓఎన్జీసీ అధికారుల సమన్వయంతో రెస్క్యూఆపరేషన్‌ను విజయవంతం చేసినందుకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

## బస్‌షెల్టర్‌ను ఢీకొట్టిన కారు

» ఒకరి మృతి, డ్రైవర్‌కు తీవ్రగాయాలు
» కోనసీమ జిల్లా మోడేకుర్రులో ఘటన



కొత్తపేట మండలం మోడేకుర్రులో బస్‌షెల్టర్‌ను ఢీకొట్టిన కారు



ప్రమాదంలో మృతి చెందిన బీర అర్జున్

కొత్తపేట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కొత్తపేటమండలం మోడేకుర్రు సమీపంలో ఓ కారు అదుపుతప్పి బస్‌షెల్టర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీనికి సంబంధించి కొత్తపేట ఏఎస్‌ఐ జీవీ కృష్ణారావు తెలిపిన వివరాలివి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం మొగళ్లమూరుకు చెందిన బీర అర్జున్(22) అమలాపురం లోని గణేష్‌నగర్ పరిధి విత్తనాల కాలువ గట్టులో నివాసం ఉంటున్నాడు. అతడు మంగళవారం తెల్లవారుజాము సమయంలో డ్రైవర్ గుబ్బల విజయగోపాలకృష్ణతో కలిసి అమలాపురం నుంచి రావులపాలెం బయలుదేరాడు. కారులో బీర అర్జున్ పడుకోగా డ్రైవర్ కారు అతివేగంతో నడుపుతున్నాడు. కొత్తపేట మండలం మోడేకుర్రు మలుపు వద్దకు వచ్చేసరికి కారు అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న బస్‌షెల్టర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ఒక వైపు నుజ్జునుజ్జవ్వడంతో బీర అర్జున్ అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ గోపాలకృష్ణకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అమలాపురం ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అర్జున్ మృతదేహాన్ని కొత్తపేట ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ కృష్ణారావు తెలిపారు.

## కత్తితో వ్యక్తిపై దాడి



దాడిలో గాయపడిన బేతాళ వెంకన్న

పిఠాపురం రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం బి.కొత్తూరులో వ్యక్తిపై కత్తితో దాడి జరిగింది. గ్రామానికి చెందిన ఎస్.వీరాంజనేయులు మోటారుసైకిల్‌పై వేగంగా వెళ్లడంతో అదే గ్రామానికి చెందిన బేతాళ వెంకన్న నెమ్మదిగా వెళ్లమని చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య వివాదం ఘర్షణకు దారితీసింది. వెంకన్నపై వీరాంజనేయులు కత్తితో దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఇద్దరూ పరస్పరం పిఠాపురంరూరల్‌పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడి మృతి



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

కొత్తపేట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి ఏఎస్‌ఐ జీవీ కృష్ణారావు తెలిపిన వివరాలివి. కొత్తపేట బోడిపాలెం వంతెన సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు రెండురోజులుగా సంచరిస్తున్నాడు. మంగళవారం అతడు ఓ చెట్టు వద్ద పడుకుని ఉండడంతో స్థానికులు చనిపోయాడని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా 60ఏళ్ల పైబడిన వృద్ధుడు కొన ఊపిరితో ఉన్నట్లు గుర్తించి 108 అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఎవరైనా తెలిసిన వారు ఉంటే స్థానిక పోలీసులను సంప్రదించాలని కోరారు.

## సత్యదేవుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు



వేదాశీర్వచనం పొందుతున్న జస్టిస్ కిరణ్మయి మండవ

అన్నవరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో బుధవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి మండవ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఏఈవో కృష్ణారావు, భాస్కరప్రసాద్ పాల్గొన్నారు.

### పిఠాపురం పాదగయలో..

పిఠాపురం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రానికి హైకోర్టు జడ్జి కిరణ్మయి బుధవారం విచ్చేశారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. వేద పండితులు ఆలయ ప్రాశస్త్యం వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ జడ్జికి స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు, ప్రసాదాలు అందజేశారు. మెరైన్ ఎస్సీ రవివర్మ దంపతులు పాదగయలోని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. వారికి ఈవో ప్రసాదాలు అందజేశారు.

## పిఠాపురంలో ముగిసిన శతచండీ మహాయాగం

» సినీనటి అన్నపూర్ణ పూజలు



మహారుద్ర సహిత శతచండీ మహాయాగంలో పాల్గొన్న సినీనటి అన్నపూర్ణ

పిఠాపురం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్ రోడ్డులోని సద్గురు గోపాల్‌బాబా ఆశ్రమంలో మూడు రోజులు జరిగిన శ్రీమహారుద్ర సహిత శతచండీ మహాయాగం బుధవారం ముగిసింది. 108 యజ్ఞ కుండాలతో 116మంది రుత్విక్కుల మంత్రోచ్చారణల మధ్య యాగ క్రతువు నిర్వహించారు. లోక కల్యాణార్థం శ్రీ సన్నిధి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 50మంది మహాసిద్ధ గురువులు, యోగులు, నాగసాధువుల సమక్షంలో సాయంత్రం మహాపూర్ణాహుతి జరిగింది. ప్రముఖ సినీ నటి అన్నపూర్ణ యాగాన్ని తిలకించిన అనంతరం గోపాల్ బాబా ఆశ్రమంలో పూజలు చేశారు. చివరిరోజు యాగ కార్యక్రమాలను తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

## ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలి

» ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్

దివాన్‌చెరువు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన రూ.2500కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయత్రినాథబాబు విజ్ఞప్తి చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే మధ్యంతర భృతి ప్రకటిస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన నాయకులు అధికారంలోకి వచ్చి ఆరునెలలు అయినా 12వ పీఆర్‌సీకి సంబంధించి ఏ విధమైన చర్యలు ఇంతవరకూ తీసుకోకపోవడంపట్ల విచారం వ్యక్తం చేశారు. సంబంధితులంతా దీనికోసం ఆశగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. త్వరలో వస్తున్న సంక్రాంతి పండుగ నాటికి 30శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించాలన్నారు. తద్వారా బోధనకు ఎక్కువ సమయం కేటాయించేలా ఉపాధ్యాయులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



దర్శనంకోసం బారులు తీరిన భక్తులు

## అన్నవరంలో భక్తుల రద్దీ

అన్నవరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధి బుధవారం క్రిస్మస్ సెలవుదినం సందర్భంగా భక్తులతో కిక్కిరిసింది. రాష్ట్రం నలుమూలల నుంచి అశేష సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండుగంటలు, ఉచిత దర్శనానికి మూడుగంటల సమయం భక్తులు క్యూలైన్‌లో వేచిఉన్నారు. బుధవారం ఒక్కరోజు 40వేలమంది స్వామిని దర్శించుకోగా వివిధవిభాగాల ద్వారా రూ.35లక్షల ఆదాయం సమకూరింది.

## పేదలకు అండగా బీజేపీ

» రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి
» బీజేపీలో చేరిన రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు



కంబాలకు బీజేపీ కండువా వేస్తున్న పురందేశ్వరి

గోకవరం,డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వాల సంఖ్య 25లక్షలకు చేరుకుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గోకవరం-తంటికొండ రోడ్డులోని సీఎండీలే అవుట్ ప్రాంగణంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు బుధవారం పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె ముందుగా మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాలకు అన్ని విధాలా న్యాయం చేసే పార్టీ బీజేపీ అన్నారు. హైందవ ధర్మాన్ని కాపాడేందుకు విజయవాడలో చేపట్టనున్న హైందవ శంఖారావం కార్యక్రమానికి అధికసంఖ్యలో ప్రజలు తరలిరావాలన్నారు. రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు చేరికతో స్థానికంగా బీజేపీ మరింత బలోపేతం అవుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ అధికసంఖ్యలో దళితుల చేరికలు పార్టీ ప్రతిష్టతకు దోహదపడతాయన్నారు. రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ వాజ్‌పేయి జయంతి, క్రిస్మస్ వేడుకల నడుమ బీజేపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో పార్టీలో తనకు ఏవిధమైన బాధ్యత అప్పగించినా క్రమశిక్షణ కల్గిన సైనికుడిలా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకుడు సోము వీర్రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేలుకూరి సూర్యనారాయణరాజు, రేలంగి శ్రీదేవి, కోడూరి లక్ష్మీనారాయణ, కాకినాడ పార్లమెంట్ అధ్యక్షుడు చెరుకూరి రామ్‌కుమార్, నాయకులు మట్టా మంగరాజు, సత్తి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక దృష్టి

» విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



డీఐజీకి పూల మొక్క అందించి ఆహ్వానిస్తున్న చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా

చింతూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మన్యంలో మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక దృష్టిసారించాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. చింతూరు పోలీసు కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసులకు పలు సూచనలు ఇచ్చారు. గంజాయి తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మారుమూల ప్రాంతాల ఆదివాసీలతో మమేకమవ్వాలని, ఎప్పటికప్పుడు మావోయిస్టుల సమాచారం అందిపుచ్చుకోవాలన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు.సరిహద్దు ప్రాంతాలపై నిఘా ఉంచాలన్నారు. కేసులనమోదు, రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.సీఐదుర్గాప్రసాద్, ఎస్ఐరమేష్ పాల్గొన్నారు.

## ముగిసిన కబడ్డీ పోటీలు

» విజేతలుగా నిలిచిన శ్రీకాకుళం బాలుర జట్టు



ప్రథమస్థానం సాధించిన శ్రీకాకుళం జట్టుకు కప్ అందిస్తున్న దృశ్యం

రావులపాలెం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సీఆర్సీ క్రీడాప్రాంగణంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్, సీఆర్సీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 50వ రాష్ట్రస్థాయి బాలుర, బాలికల జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారంతో ముగిశాయి. బాలుర విభాగం నుంచి ఫైనల్‌కు శ్రీకాకుళం, విజయనగరం బాలుర జట్లు చేరుకున్నాయి. శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. విజయనగరం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. దీంతో విజేతలకు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొలుగూరి వెంకటరెడ్డి, కార్యదర్శి యలమించిలి శ్రీకాంత్, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్ రెడ్డి, స్పోర్ట్స్ డైరక్టర్ వీరరాఘవరెడ్డి, అంజనికుమార్‌రెడ్డి, చిర్ల కనికిరెడ్డి తదితరులు విజేతలకు కప్, బహుమతులను అందచేశారు.

## మహిళ హత్య

» ఆలస్యంగా వెలుగు చూసిన వైనం



మణి మృతదేహం

కాకినాడ క్రైం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓ మహిళ హత్యకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జగన్నాథపురం కేశనవారిదొడ్డికి చెందిన ఉప్పాడ మణి(31) 17ఏళ్ల క్రితం మనస్పర్థల కారణంగా తన భర్త ఆదినారాయణతో విడిపోయింది. వారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె నిమ్మకాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో ఆమెకు ఏడేళ్ల క్రితం సెంట్రింగ్ పని చేసే కర్రి శంకర్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి అది కాస్తా సహజీవనంగా మారింది. వారు కేశనవారి దొడ్డిలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. కాగా వారి మధ్య కొంతకాలంగా ఆర్థికపరమైన సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలో ఈనెల 22వతేదీ అర్ధరాత్రి ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణ నేపథ్యంలో శంకర్ ఆమె ముఖంపై పిడిగుద్దులు కురిపించి హత్య చేశాడు. మరుసటిరోజు ఉదయం ఆమె కుటుంబీకులకు ఫోన్ చేసి ఓ కథ అల్లాడు. తాను ఉదయాన్నే పనికి వెళ్లానని, మణికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదని తిరిగి ఇంటికి వెళ్లి చూసేసరికి మంచంపై విగత జీవురాలిగా పడి ఉందని చెప్పాడు. అనంతరం మృతురాలి సోదరుడు ఉప్పాడ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేర కు వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావ్ సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనం తరం పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్ మార్చురీకి తరలించారు. నిందితుడు శంకర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా డబ్బుల కోసం తానే మణిని హత్య చేసినట్లు అంగీకరించాడని సీఐ నాగదుర్గారావ్ తెలిపారు. ఈ ఘటనపై కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి



చక్రద్వారబంధంలో నిరుపయోగంగా దర్శనమిస్తున్న సంత మార్కెట్ భవనం

## సంత లేక చింత!

**● నిరుపయోగంగా సంత మార్కెట్ భవనం**

రాజానగరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) :మండలంలో చక్రద్వారబంధంలో లక్షలాది రూపాయలు వెచ్చించి రెండు దశాబ్దాల కిందట నిర్మించిన సంతమార్కెట్ భవన సముదాయం అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ప్రజల ఇబ్బందులతో పాటుగా గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూరు తుందనే ఉద్దేశంతో సుమారు రెండు దశాబ్దాల కిందట రూ.5లక్షల నాబార్డు నిధులతో నిర్మించిన దుకాణాల సముదాయ భవనం నాటి నుంచి నేటి వరకు అలంకార ప్రాయంగా మారింది. గ్రామంలో వారపుసంత నిర్వహణలో భాగంగా వ్యాపారులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అప్పట్లో భవనం నిర్మించారు. దుకాణదారులకు అనువుగా ఉండేలా షెట్టర్లు అమర్చకుండా వదిలేయడంతో అప్పటినుంచి నిరుపయోగంగా పడి ఉంది. ఈ భవనం వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అటు అధికారులుగానీ, ఇటు ప్రజాప్రతినిధులుగానీ పట్టించుకున్న దాఖలాలు లేకపోవడం దురదృష్టకరం. ఈ భవనంలోని గదులు ఆకతాయిలకు అడ్డాగా మారాయి. సీజనల్‌గా వచ్చే పలు రకాల పండ్ల తోటలకు ప్రసిద్ధిగాంచిన చక్రద్వారబంధంలో నేరేడు, రేగు, సపోట, మామిడి తదితర పండ్ల వ్యాపారం జోరుగా సాగుతుంది. గ్రామంలో నిర్మించిన భవనంలో దుకాణాలు అందుబాటులోకి రాకపోవడంతో గ్రామంలోని ప్రధాన రహదారిపై కూడళ్లలో ఈ వ్యాపార కార్యకలాపాలు సాగిస్తుండటంతో స్థానికులతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దుకాణలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసు కొస్తే పంచాయతీకి ఆదాయం సమకూరడంతోపాటు స్థానిక పండ్ల వ్యాపారులకు ఎంతోమేలు చేకూరు తుందని వ్యాపారులు భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి గ్రామస్థులకు సంత మా ర్కెట్ చింత తీర్చే దిశగా అధికారులు కృషి చేయాలని వ్యాపారులు కోరుతున్నారు.

## హ్యాపీ క్రిస్మస్..మెర్రీ క్రిస్మస్

**● ఘనంగా క్రిస్మస్ ప్రార్థనలు**

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో చర్చిలన్నీ ప్రత్యేక ప్రార్థనలతో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. నగరంలోని సెయింట్ పాల్స్ చర్చ్, గోర్లియా చర్చ్, సెయింట్ పీటర్స్ చర్చ్, హోలీట్రినిటీ చర్చ్, లూథర్‌గిరి చర్చ్, బైబిల్ మిషన్ చర్చ్, క్రైస్ట్ వర్షిప్ చర్చ్,సెయింట్ లూక్స్ లూథరన్ చర్చిలలో క్రిస్మస్ వేడుకను ఆనందంగా జరుపుకున్నారు. పాస్టర్లు క్రీస్తు సందేశాలను పాస్టర్లు చేశారు. కొవ్వొత్తులతో ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్‌లను కట్ చేశారు.పలు చర్చిల్లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రార్థనలు చేశారు. క్రైస్తవ సోదరసోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. లాలాచెరువు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు వృద్ధుల మధ్య క్రిస్మస్ కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమాలలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, మజ్జి రాంబాబు, మరుకుర్తి రవియాదవ్, చాపల చిన్నరాజు, కానేటి కృపామణి , స్వర్ణాంధ్ర మేనేజరు హరికృష్ణ, కొండలరావు, శ్రీహరి ప్రసాద్, ధనలక్ష్మి, మీరా కుమారి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**క్రీస్తు ప్రేమ, కరుణ ఆదర్శప్రాయం**

**● ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ**

**కోరుకొండ:** ఏసుక్రీస్తుతోటి మానవుల పట్ల చూపించే ప్రేమ, కరుణ క్షమాగుణాలు సమాజంలో ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. క్రీస్తు జన్మదినం సందర్భంగా కోరుకొండ మండలం బొల్లేదుపాలెంలో కృపా ప్రార్థనా మందిరంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రార్థనా మందిరం వారు ఏర్పాటుచేసిన కేక్ కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు తమ జీవితం అంతా ప్రేమ, కరుణ, క్షమాగుణాలు మానవాళికి అందించిన మహనీయుడు అన్నారు. సామాజిక విలువలు చైతన్యవంతం కావాలంటే క్రీస్తుబోధించిన శాంతి, సహనం, ఔదార్యం సర్వదా ఆచరణీయమన్నారు. ప్రతి మనిషి ఎంతోకొంత పరోపకార గుణాన్ని అలవర్చుకోకపోతే జీవితానికి అర్థం ఉండదని క్రైస్తవం బోధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృపా ప్రార్థనా మందిరం బిషప్ బి.రాజు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవుళమ్మ, టీడీపీ నాయకులు పి.వెంకటరత్నం, పలువురు కూటమి నాయకులు, పాస్టర్స్, క్రైస్తవులు పాల్గొన్నారు.

**రంగంపేట:** మండలంలో గల 17 గ్రామాల్లో గల చర్చిల్లో యేసుక్రీస్తు పుట్టినరోజు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలు అన్నీ రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేశారు. చిన్నారుల శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులు అందరినీ ఆకట్టుకున్నారు. భక్తిశ్రద్ధలతో క్రైస్తవులంతా చర్చిల్లో ప్రార్థనలు చేశారు. రంగంపేట మండలం వడిశలేరు లూథరన్ చర్చిలో చిన్నారులు వేసిన స్కిట్‌లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**బిక్కవోలు:** మండలంలోని అన్ని చర్చిల్లోను బుధవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. బలభద్రపురంలోని పెంతెకోస్తు చర్చి వారు తమ సభ్యులతో కలసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ బలభద్రపురం నుంచి తొస్సిపూడి, పందలపాక గ్రామాల మీదుగా ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో పాస్టర్లు విజయకుమార్, ఆశీర్వాదం, సర్పంచ్ బుంగా రామారావు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



రాజమహేంద్రవరంలో క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



బిక్కవోలు: బలభద్రపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

## మనుధర్మ ప్రతుల దహనం



అంబేడ్కర్ విగ్రహం వద్ద మనుధర్మశాస్త్ర ప్రతులను దహనం చేస్తున్న బీఎస్పీ నాయకులు

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, బీసీ, ఎస్టీ,మైనార్టీలను అంటరానివారుగా చూస్తే చలించిన అంబేడ్కర్ నాడు నడిరోడ్డుపై మనుధర్మ శాస్త్రం ప్రతులను దహనం చేశారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం మనుధర్మశాస్త్ర ప్రతులను దహనం చేశారు. నాటి నుంచి ప్రతి ఏటా డిసెంబరు 25న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ఇసుకపట్ల రాంబాబు, పరమట గణేశ్వరరావు, బీసీ సంఘాల నేత కేకే సంజీవరావు, కొంకి రమేష్, జార్జి అంటోని, లాజర్, నక్కా వెంకటరత్నం, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్‌కు సత్కారం

అనపర్తి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్‌గా ఎన్నికైన తమలంపూడి సుధాకరరెడ్డిని బుధవారం అనపర్తిలోని ఆయన స్వగృహంలో రాష్ట్ర కేబుల్ టీవీ ఆపరేటర్ల అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. ప్రజా క్షేత్రంలోనే కాకుండా కేబుల్ టీవీ రంగంలో విశేష సేవలందిస్తున్న సుధాకరరెడ్డి రైతుల సంక్షేమానికి మరిన్ని సేవలందిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో రాష్ట్ర కేబుల్ టీవీ అసోసియేషన్ ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కేబుల్ టీవీ ఆపరేటర్లు ప్రసాద్‌రెడ్డి, తేతల వెంకటరెడ్డి, మణికంఠరెడ్డి,బాపిరెడ్డి, గణేష్, సత్యనారాయణరెడ్డి, చిర్ల గంగిరెడ్డి పాల్గొన్నారు.



ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డిని సత్కరిస్తున్న కేబుల్ టీవీ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు

## అనంతరావుకు ఉత్తమ సేవా పురస్కారం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 25( ఆంధ్రజ్యోతి): జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు రాష్ట్ర ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పుస్కారం అందుకున్నారు. బుధవారం రాజమహేంద్రవరంలో పలువురు అభినందించారు.




అనంతరావుకి రాష్ట్ర ఉత్తమ పురస్కారాన్ని అందిస్తున్న మంత్రి నాదెండ్ల

## కాపు నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం కల్చరల్ డిసెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): కాపు విద్యార్థులు ఉద్యోగావకాశాలు పొందడానికి ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్టు కాపునాడు ఉమ్మడి గోదావరి జిల్లాల అధ్యక్షుడు గుదే రఘు నరేష్ తెలిపారు. కాపునాడు వ్యవస్థాపకుడు మిరియాల వెంకట్రావు జయంతిని పురస్కరించుకుని బుధవారం దేవీచౌక్‌లోని కాపునాడు కార్యాలయంలో నివాళులర్పించారు. కాపు విద్యార్థులకు ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, రైల్వే, బ్యాంక్, సివిల్ సర్వీసెస్‌కు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల కాపు విద్యార్థులు జి.రఘు, సెల్ నెం.9397950465ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలు కృష్ణనాయుడు,ముమ్మిడి వీరబాబు,విన్నా వాసు,దేశినీడి రాంబాబు,కాళ్ళ చక్రరావు,డి.చక్రపాణి తదితరుల పాల్గొన్నారు.

### 'వంగవీటి రంగా విగ్రహావిష్కరణకు తరలిరండి'

నల్లజర్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అనంతపల్లిలో గురువారం నిర్వహించే వంగవీటి మోహన రంగా, శ్రీ కృష్ణదేవరాయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గంలో కాపు సోదరులు, రంగా అభిమానులు తరలిరావాలని అనంతపల్లి రంగా మిత్రమండలి కాపు సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, కరాటం రాంబాబు విచ్చేస్తున్నట్లు చెప్పారు.







రంగంపేట, సీతానగరంలో వాజ్‌పేయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

## దేశాభివృద్ధికి వాజ్‌పేయి సేవలు ఎనలేనివి

రంగంపేట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం రంగంపేట ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బీజేపీ సీనియర్ నాయకుడు ఉండవిల్లి మాణిక్యం సమక్షంలో వాజ్‌పేయి జయంతిని జరిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మండవిల్లి గుప్త, మండల అధ్యక్షుడు ఎం.సాయిరాం, ఉపాధ్యక్షుడు భాస్కరరావు, కె.సాయితాతారావు, పోతుల వీర సుందరరావు, త్రిమూర్తులు, సురేష్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**సీతానగరం:** దేశ ప్రధానిగా అటల్ బిహారీ వాజ్‌పేయి దేశాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని బీజేపీ జిల్లా కార్యదర్శి బత్తిన వీరాంజనేయులు అన్నారు. బుధవారం సీతానగరంలో వాజ్‌పేయి జయంతిని జరిపారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు మన దేశ గొప్పతనాన్ని చాటిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల మహిళా అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి, మద్దాల కొండలరావు, యువ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి ఖండవల్లి సాయి, మండల ఉపాధ్యక్షుడు సత్యం రామకృష్ణ, న్యాయవాది లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



బలభద్రపురంలో శేష వాహనంలో ఊరేగుతున్న వెంకటేశ్వరుడు

### శేష వాహనంపై విహరించిన వెంకటేశ్వరుడు

బిక్కవోలు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ద్వితీయ బ్రహ్మోత్సవాలు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ఉదయం ప్రవిత్రోత్సవం, పంచామృత అభిషేకం, పతాకావిష్కరణలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను శేష వాహనంలో వుంచి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ మల్లిడి గంగారెడ్డి అన్నప్రసాద వితరణ చేశారు.




1981-82 బ్యాచ్‌కు చెందిన హైస్కూల్ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

రంగంపేట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మనుషుల మధ్య స్నేహం, ఆత్మీయతను పెంచుతుందని పూర్వపు విద్యార్థి, రంగంపేట జడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. బుధవారం రంగంపేట ఉండవిల్లి వీరవెంకట సత్యనారాయణ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1981-82 బ్యాచ్‌కి చెందిన టెన్త్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది హైస్కూల్ షష్టిపూర్తి ఉత్సవాన్ని నిర్వహించడానికి అన్ని బ్యాచ్‌లు కలిసి రావాలన్నారు. పాఠశాల విద్యాభివృద్ధికి ప్రతి బ్యాచ్ తమ సహకారం అందించాలన్నారు. తమ బ్యాచ్ నుంచి కూడా సహాయం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సరస్వతీ మాత, గణేష్ విగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం ఒకరికొకరు పరిచయం చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో ఎం. శ్రీనివాసరావు, గారపాటి వెంకటేశ్వర్లు, శివరామకృష్ణ, సూరిబాబు, వీరవెంకట శేషగిరిరావు, సత్యనారాయణ, శ్యామలావతి, విమల, వెంకటలక్ష్మి, సాయిబాబు, గణేష్, బాబూరావు, పద్దరాజు, వీరభద్రరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

కొవ్వూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలలో మీకు కష్టం ఎదురైనప్పుడు, మీ కుటుంబాన్ని పెద్ద కొడుకులా ఆదుకుంటానని చంద్రబాబు ఇచ్చిన మాటను సీఎం సహాయ నిధి ద్వారా ఆసుపత్రి ఖర్చులకు ఆర్థిక సహాకారం అందిస్తూ నిలబెట్టుకుంటున్నట్లు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని టీడీపీ కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. చాగల్లు మండలం కలవలపల్లి గ్రామానికి చెందిన కారింకి దుర్గారావుకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.57,522ల చెక్కును ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన వ్యక్తులతోనే ఆనందమయ సమాజం, అత్యుత్తమ అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కుటుంబంలో ఒకరు అనారోగ్యం పాలైతే కుటుంబం మొత్తం కలత చెందుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్యసేవ కింద పేద ప్రజలకు వైద్యసేవలు అందిస్తుంది. ఎన్టీఆర్ వైద్యసేవలో లేని వ్యాధులకు ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్న వారికి సహాయం అందజే స్తామన్నారు.



గౌతమి గ్రంథాలయంలో పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## సాహితీ వేదిక వార్షిక సమావేశం

రాజమహేంద్రవకం కల్చరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రి సాహితీ వేదిక సభ్యుల వార్షిక భేటీలో భాగంగా బుధవారం గౌతమి ప్రాంతీయ గ్రంథాలయంలో మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. ఆరిపిరాల నారాయణరావు కృత అంత్యాను ప్రాస నిఘంటువును మల్లాప్రగడ రామారావు ఆవిష్కరించారు. భాస్కరం రచించిన బహు రూపులవాడు పుస్తకాన్ని కల్లూరి వెంకట రమణ, మళ్లీ నది ఒడ్డున పుస్తకాన్ని రెంటాల వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాహితీ వేదిక సభ్యులు సీహెచ్ శకుంతలా దేవి, విశ్వనాథం, సాధనాల వెంకట స్వామినాయుడు, నల్లగొండ రవిప్రకాష్, సూర్యనారాయణ, సత్య భాస్కర్, జోరా శర్మ, రాఘవ రావు తదితరులు పాల్గొన్నారు.

### 'శాంతియుత సమాజానికి కృషి చేసిన వాజ్‌పేయి'

నిడదవోలు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజకీయం, సాహిత్యాన్ని సమపాళ్ళలో నడిపించిన నాయకుడు భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకుని నిడదవోలు చర్ల సుశీల వృద్ధాశ్రమంలో వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ ఆధ్వర్యంలో వృద్ధులకు బట్టలు పంపిణీ చేశారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో శాంతియుత సమాజానికి కృషి చేశారని, అన్నిమతాల ను సమానంగా గౌరవించారన్నారు. దేశ వ్యాప్తం గా నేషనల్ హైవేలను 4, 6 లైన్ల రహదారులు, ఆర్‌వోబీలకు ఆద్యుడన్నారు. కార్యక్రమంలో ము న్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, బీజేపీ నాయకులు ఎం. సత్యనారాయణ, రామారావు, రంగా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## సంక్రాంతికి గుంతల్లేని రహదారులే లక్ష్యం : మంత్రి దుర్గేష్

నిడదవోలు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా సంక్రాంతి నాటికి గుంతలులేని రహదారులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు పట్టణంలో రోడ్ల మరమ్మతు పనులకు బుధవారం మంత్రి దుర్గేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ సుమారు రూ.45 లక్షల అంచనా వ్యయంతో రోడ్ల మరమ్మతులకు శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే నియోజకవర్గానికి రూ.11 కోట్లు నిధులు తీసుకువచ్చామని, రాబోయే రోజులలో నిడదవోలు పట్టణాన్ని అన్నిరంగాలలోను ముందుకు తీసుకువెళ్తామన్నారు. సీసీ రోడ్లు ఎక్కడెక్కడ అవసరమో గుర్తించి వాటిని నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. మరో 4 లేక 5 నెలల్లో రూ.30 కోట్లతో రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్‌చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, కమీషనర్ కృష్ణవేణి, డీఈ హరిబాబు, కూటమి నేతలు కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, బండి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలులో మంత్రి దుర్గేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న దృశ్యం



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 26 డిసెంబరు 2024 | 5





రాజమహేంద్రవరంలోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు

# నీ రాకడ కోసం..

రక్షకుడు ఉదయించినాడట.. మన కొరకు పరమ రక్షకుడు ఉదయించినాడట.. అంటూ బుధవారం ఉదయం నుంచి ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా చేసుకున్నారు.. విశ్వాసులు పెద్ద ఎత్తున చర్చిలకు హాజరై ప్రార్థనలు చేశారు.. నాయకులు ప్రార్థనాల్లో పాల్గొన్నారు. మాకోసం రావయ్యా ఏసయ్యా అంటూ ప్రభువును పిలిచారు..కొవ్వొత్తులు పట్టుకుని వీధుల వెంట పెద్ద ఎత్తున ర్యాలీలు చేశారు.. హ్యాపీ క్రిస్మస్..మెర్రీ క్రిస్మస్ అంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ జిల్లా అంతటా ఆనందంగా గడిపారు. - 8లో




రాజమహేంద్రవరంలోని చర్చిల్లో పాస్టర్ల ప్రార్థనలు



జ్యోతి వెలిగించి క్రిస్మస్ శుభాకాంక్షలు చెబుతున్న కలెక్టర్ ప్రశాంతి.. కోరుకొండలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



కోరుకొండ మండలంలో బరకాలు కప్పి ఉంచిన ధాన్యం

## చల్లబడిన వాతావరణం

### ఆందోళనలో రైతాంగం

రాజమహేంద్రవరం సిటీ/కోరుకొండ ,డిసెంబర్ 25(ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు వరి కోతలు నిలిపివేశారు. దీంతో పక్వానికి వచ్చిన వరి ధాన్యం నేలరాలిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరి కోతలు కోసి కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యం గత మూడు రోజులుగా కురిసిన ముసురు వర్షాలకు తడిసి ముద్దయింది.దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.జిల్లాలో గడచిన 24 గంటల్లో 15 మండలాల్లో 32.4 శాతం వర్షపాతం నమోదైంది. బిక్కవోలులో అత్యధికంగా 4.2 మి.మీ వర్షపాతం నమోదైంది. గోకవరం,సీతానగరం మండలాల్లో అత్యల్పంగా 1 మి.మీ వర్షం పడింది. నల్లజర్లలో 3.2 మి.మీ, కోరుకొండలో 3.2, దేవరపల్లిలో 2.8 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 2.8 మి.మీ,తాళ్ళపూడిలో 2.6 మి.మీ, రాజమహేంద్రవరంలో 2.4 మి.మీ, గోపాలపురంలో 1.8 మి.మీ, చాగల్లులో 1.8 మి.మీ, కడియంలో 1.8 మి.మీ అనపర్తిలో 1.4 మి.మీ, నిడదవోలులో 1.2, కొవ్వూరులో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.వాతావరణం పూర్తిగా చల్లబడింది. చలిగాలి తీవ్రత కూడా పెరిగింది.




# తప్పదే.. అధరహో!

**పండుగకు వెళ్లాలి ఎలాగైనా.. ఇదీ ప్రతి ఒక్కరి ఆశ.. ఈ ఆశనే కొందరు క్యాష్ చేసుకుంటారు.. ప్రతి ఏడాది ఇంతే.. ఈ ఏడాది జరుగుతున్నది ఇదే.. హైదరాబాద్.. బెంగుళూరు.. చెన్నై.. పుణె ఇలా ఏ పెద్ద నగరంలోనైనా గోదావరి జిల్లాల వాళ్లు ఉండకుండా ఉండరు.. వీళ్లంతా కుటుంబంతో కలిసి ప్రతి ఏడాది పండుగకు వస్తారు.. స్వగ్రామాల్లో ఆనందంగా గడిపి వెళ్లిపోతారు.. ప్రస్తుతం అక్కడి నుంచి రావడమే గగనంగా మారింది.. పండుగకు సుమారు మూడు వారాలున్నా ధరలు పెంచేశారు.. రైళ్లు.. బస్‌లు.. విమానాలు.. ఏవి చూసినా అంతే.. అప్పుడే ధరలు అదరగొట్టేస్తున్నాయి..**

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండగకు ఊరు రావాలనుకునే వారికి అప్పుడే టికెట్ చార్జీలు షాక్ కొడుతున్నాయి. విమాన టిక్కెట్ల నుంచి బస్సు, రైలు టికెట్లు చుక్కలు చూపిస్తున్నాయి. అడ్డగోలుగా రేట్లు పెంచేసి అప్పుడే ఆయా ట్రావెల్స్ ప్రయాణికుల జేబులు గుల్ల చేసేస్తున్నాయి. దీంతో ఎక్కడెక్కడి నుంచో పండగకు ఊరొద్దామని ఆశపడే వారికి ప్రయాణం ప్రయాసగా మారిపోయింది. ప్రధానంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంతోపాటు అనేక పట్టణ ప్రాంతాలకు చెందినవారు వ్యాపార, ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో అధికంగా స్థిరపడ్డారు. బెంగళూరు, చెన్నైతోపాటు అనేక ప్రాంతాల్లోను ఉమ్మడి జిల్లా వాసులు వివిధ అవసరాలరీత్యా ఉంటున్నారు. వీరంతా ఎలాగైనా పెద్ద పండగకు ఊరు రావాల్సిందే. అయితే పండగ దగ్గర పడడం, ఇంకా మూడు వారాలు కూడా లేకపోవడంతో సొంతూరుకు రావడానికి టికెట్లు బుక్ చేసుకోవడానికి ప్రయత్నిస్తే చార్జీలు షాక్ కొట్టేస్తున్నాయి. పండగకు రావడమే కాదు.. తిరుగు ప్రయాణం టిక్కెట్లు సైతం అప్పుడే వేలల్లోకి ఎగబాకి చుక్కలు చూపించేస్తున్నాయి. విమానం, రైలు, బస్సు వేటి ధరలు చూసినా బెంబేలెత్తిస్తున్నాయి.

### ప్రైవేట్ ట్రావెల్స్ బాదుడు..

పండగకు కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ జిల్లాలకు చెందిన అనేకమంది హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి భారీగా స్వగ్రామాలకు ముందే చేరుకుంటారు. దీంతో అనేక

## పండుగకు ఊరొచ్చేదెలాగో..

మంది బస్సు టిక్కెట్లకు ప్రయత్నిస్తుంటే చార్జీలు గూబగుయ్‌మనేలా చేస్తున్నాయి. ప్రధానంగా ప్రైవేటు ట్రావెల్స్ అయితే చుక్కలు చూపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో ఏసీ స్లీపర్ బస్సు చార్జీలు హైదరాబాద్ నుంచి కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురానికి రూ.1,099 నుంచి రూ.1,100 వరకు ఉండగా పండగా పేరుతో ఏకంగా రూ.3,990 వరకు పిండేస్తున్నాయి. ప్రధానంగా హైదరాబాద్ నుంచి కాకినాడ, రాజమహేంద్రవరానికి సుమారుగా 12కిపైగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు రోజుకు 50కిపైగా సర్వీసులు నడుస్తాయి. పండగకు వీటిని దాదాపు 70 వరకు పెంచాయి. వీటిలో ఇప్పుడు పండగ చార్జీలు రూ.3,200 నుంచి రూ.3,900 వరకు వసూలు చేస్తున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే సాధారణ రోజుల్లో చార్జీలతో పోల్చితే మూడు రెట్లు పెంచేశారు. వాస్తవానికి ఇప్పుడు శీతాకాలం నేపథ్యంలో బస్సుల్లో ఏసీ చార్జీలను తగ్గించాలి. కానీ సంక్రాంతి పండగ పేరుతో అడ్డంగా బాదేస్తున్నాయి. అయితే పండగ దగ్గరపడితే ఈ చార్జీలు రూ.5వేలకుపైగా ఎగబాకినా ఆశ్చర్యపోనవసరంలేదు. మరోపక్క ఈ రూట్లో ఆర్టీసీ బస్సులు నాన్‌ఏసీ కేటగిరీలో రూ.770 వరకు వసూలు చేస్తున్నా చాలావరకు సీట్లు నిండిపోయాయి. ఇదిలా ఉండగా హైదరాబాద్ నుంచి కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలతో పాటు అమలాపురం పట్టణానికి ఆర్టీసీ వచ్చే నెల 9,10,11,12 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడుపుతోంది. వీటిలోనూ చాలావరకు సీట్లు నిండిపోయాయి.

- పండుగ బాదుడే..బాదుడు
- బస్సులు,రైళ్ల టిక్కెట్ల ధరలు ఫుల్
- విమాన చార్జీలకు రెక్కలు
- హైదరాబాద్ నుంచి రూ.7,500
- బెంగళూరు నుంచి రూ.8 వేలు
- రోజుకు ఆరు ఇండిగో సర్వీసులు
- అప్పుడే సగానికిపైగా టికెట్లు ఫుల్
- బస్సు చార్జీలు పెంచేశారు
- ఏసీ స్లీపర్ టిక్కెట్లు రూ.3,900
- పిండేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్
- అన్ని ట్రైన్లలోను రిగ్రెట్
- గోదావరివాసులకు పండగ షాక్

### రైళ్లన్నీ రిగ్రెట్..

హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం, సామర్లకోటకు రోజుకు దాదాపు 17 రైళ్లు నడుస్తుంటాయి. ఎక్కువమంది పండగకు రైళ్లలో రావడానికి ప్రయత్నిస్తారు. కానీ సంక్రాంతి నేపథ్యంలో వీటిలో సీట్లన్నీ నిండిపోవడంతోపాటు ఏకంగా రిగ్రెట్ చూపిస్తోంది. ఎన్ని రైళ్లు రద్దీగా ఉన్నా కొంతకాలం కిందట ప్రవేశపెట్టిన వందే భారత్ రైళ్లలో సీట్లు కొంతవరకు ఎప్పుడూ ఖాళీగా ఉంటాయి. కానీ పండగ రద్దీ నేపథ్యంలో వీటికి కూడా సీట్లు రిగ్రెట్ చూపిస్తున్నాయి. ప్రధానంగా వచ్చే నెల 9 నుంచి అయితే అసలు వెయిటింగ్ లిస్ట్ కాదు కదా అవి కూడా నిండిపోయి రిగ్రెట్ దశకు వచ్చేశాయి. విశాఖ ఏసీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నుంచి గరీబ్‌రథ్, గోదావరి, ఫలక్‌నుమా, జన్మభూమి, గౌతమి, ఈస్ట్‌కోస్ట్, విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ పూర్తిగా రద్దీగా మారి రిగ్రెట్ చూపిస్తున్నాయి. దీంతో జనం సొంతూళ్లకు రావడానికి నానా తంటాలు పడాల్సిన పరిస్థితి. విమానాల దగ్గర నుంచి బస్సులు, రైళ్ల ఎక్కడికక్కడ సీట్లన్నీ అప్పుడే ఫుల్ అయిపోయాయి. అటు దగ్గరచేసి తత్కాల్‌లో టికెట్లు తీసుకుందామన్నా బాదుడు మామూలుగా లేదు. దీంతో చాలామందికి దిక్కుతోచడం లేదు.

### ఎగరాలంటే జేబులు గుల్లే..

ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాలకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు ఎక్కువగా జనం వస్తుంటారు. ప్రస్తుతం చాలామంది వేగంగా రావడం కోసం విమానాలపైనే ఆధారపడుతున్నారు. తీరా ఇప్పుడు వీటి చార్జీలు ఆకాశాన్నంటేశాయి. ప్రధానంగా వచ్చే నెల 13 నుంచి భోగి పండగ మొదలు కానుంది. ఈ మేరకు ముందుగానే జనం టిక్కెట్లకు ప్రయత్నిస్తుంటే వేలకు వేలు పిండేస్తున్నారు. ప్రధానంగా హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి ఇండిగో సంస్థ రోజుకు ఆరుకుపైగా సర్వీసులు నడుపుతోంది. సాధారణ రోజుల్లో ఫ్లైట్ టికెట్ ధర రూ.3,999 వరకు ఉంటోంది. కానీ సంక్రాంతి పండగ పేరుతో అప్పుడే ఇండిగో చార్జీలు ఆకాశన్నంటేశాయి. ప్రధానంగా జనవరి 7న హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి ఫ్లైట్ టిక్కెట్ ఒకరికి రూ.4,510 ఉంది. జనవరి 8న రూ.5,350, 9న రూ.6,190, 7న రూ.7,135, 8న రూ.5,350, 9న రూ.6,190, 10న రూ.7,135, 11న రూ.7,765 12న రూ.6,610, 13న రూ.4,510వరకు వసూలు చేస్తోంది. అయితే పండగకు ఇంకా రెండువారాలకుపైగా సమయం ఉండడంతో ఇప్పుడే ఈ ధరలు షాక్ కొడుతుండగా.. సమయం దగ్గర పడే కొద్దీ ఈ చార్జీలు రూ.14 వేలకుపైగా ఎగబాకనున్నాయి. అటు పండగ ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణం అయ్యే వారికి సైతం చార్జీలు దడ పుట్టిస్తున్నాయి. ప్రధానంగా జనవరి 16 నుంచి ఏకంగా అప్పుడే టికెట్ చార్జీలు రూ.9,700కు ఎగబాకేశాయి. వ్యవధి దగ్గరపడే కొద్దీ ఛార్జీలు రూ.16 వేలకుపైగా ఉండే అవకాశం ఉంది. అటు బెంగళూరు నుంచి రాజమహేంద్రవరం సాధారణ రోజుల్లో ఇండిగో చార్జీలు రూ.3,999 కాగా పండగ పేరుతో అప్పుడే రూ.7,800 వరకు పిండేస్తోంది. ప్రధానంగా ఈ రూట్లో రోజూ నడిచే ఆరు సర్వీసుల్లో వచ్చే జనవరి ఏడవ తేదీన టికెట్ చార్జ్ రూ.5,983 కాగా 8న రూ.7,095, 9న రూ.7,020, 10న రూ.8,265, 11న రూ.7,851, 12న రూ.7,851 13వ తేదీన రూ.6,412 వరకు ఉంది.




# ఆఫర్ల వల

**రండి బాబూ రండి.. మంచి తరుణం మించిన దొరకదు.. పండుగ ఆఫర్.. మీకోసమే.. ఒకటి కొనండి.. మరొకటి ఉచితంగా తీసుకెళ్లండి.. ఈ ఒక్క మాట చాలు.. అంతే జనం ఎగబడిపోతున్నారు.. ఎందుకిస్తారు..ఎలా ఇస్తారు.. అనేది కనీసం ఆలోచించడంలేదు.. ఫ్రీ అంటే పెనాయిల్ అయినా తాగేస్తారనే నానుడిని నిజం చేస్తున్నారు.. ఉభయ గోదావరి జిల్లాలకు రాజమహేంద్రవరమే ప్రధాన వాణిజ్య పట్టణం.. పండుగ షాపింగ్‌కు ఎక్కడి నుంచైనా ఇక్కడికే వస్తారు.. ఇదే అదునుగా వ్యాపారులు కొనుగోలుదారుల ఆశను క్యాష్ చేసుకుంటున్నారు.. ఆఫర్ల పేరుతో వల వేసి తమ షాపులోకి లాగేస్తున్నారు.. నాణ్యతలేని దుస్తులను ఆఫర్ల పేరుతో అంటగట్టేసి జేబులు గుల్ల చేస్తున్నారు.. కొత్త స్టాక్ అయితే మాత్రం తగ్గేదేలే..**

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఫ్రీ..ఫ్రీ..ఫ్రీ..ఎటు చూసినా ఇవే హోర్డింగ్‌లు.. ఏ షాపు వద్ద చూసినా పెద్ద ఎత్తున ఆఫర్లు.. ఒకటి కొంటే రెండు ఉచితం.. రెండు కొంటే నాలుగు ఉచితం.. ఎంత కొంటే అంతా ఫ్రీ..ఇలా అంటేనే జనం ఎగబడుతున్నారు.. ఆ బోర్డులు చూసి లోపలకు వెళ్లారా.. అక్కడంతా మోసమే.. అసలు..నకిలీ సినిమాలా ఉంటుంది.. ఆఫర్లకు ఇచ్చే దుస్తులు ఒకటి.. ఎమ్మార్పీ ధరలపై విక్రయించే దుస్తులు ఒకటి.. తీరా షాపు లోపలకు వెళ్లిన తరువాత ఏదో ఒకటి కొని తెచ్చుకోవాలని.. జేబు ఖాళీ చేసుకుంటున్నారు.

### వ్యాపారులకు పెద్ద పండుగ..

గోదావరి జిల్లాలకు ప్రముఖ వాణిజ్య కేంద్రం రాజమహేంద్రవరం..ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి రాజమహేంద్రవరం మార్కెట్‌కు పెద్ద ఎత్తున కొనుగోలుదారులు తరలివస్తుంటారు. ఇదే అదునుగా వ్యాపార సంస్థలు క్రిస్మస్, న్యూ ఇయర్,సంక్రాంతిలను పురస్కరించుకుని ఆఫర్లపై ఆఫర్లతో ఊదరగొతున్నాయి.పండగ పేరు చెబితే చాలు గోదావరి జిల్లాల్లో ఎక్కడ లేని ఉత్సాహం వస్తుంది.. క్రిస్మస్, పెద్ద పండుగ అంటే వదిలేది లేదు.వేలకు వేలు ఖర్చు చేసి షాపింగ్ చేస్తుంటారు.నెలరోజుల ముందు నుంచి సందడి చేస్తారు. ప్రతి ఏటా డిసెంబరు ఒకటో తేదీ నుంచి వ్యాపారం ఆరంభమైపో తోంది.ఇదే అదునుగా వ్యాపారులు క్యాష్ చేసు కుంటున్నా రు. 50 రోజుల్లోఒక్క రాజమహేంద్రవరంలోనే రూ.వెయ్యి కోట్ల వ్యాపారం జరుగుతుందంటే అతిశయోక్తి కాదు.రాజమహేంద్రవరంలో బట్టల షాపులు సుమారు 800 వరకూ ఉంటాయి. జిల్లా మొత్తం అయితే 1200 ఉంటాయి. బంగా రం దుకాణాలు రాజమహేంద్రవరంలోనే 500 వరకూ షాపులు ఉంటాయి.జిల్లాలో లెక్కవేస్తే సుమారు 700 వరకూ ఉండొచ్చు.ఇవి గాక మాల్స్, షూమార్ట్‌లు 200 వరకూ ఉంటాయి. పండుగ వస్తుందంటే ఈ మూడింటికి డిమాండ్ ఎక్కువే.దీంతో వ్యాపారులు భారీ ఆఫర్లు పెట్టి క్యాష్ చేసుకుంటున్నారు.

### డిస్కౌంట్ వెనుక..

చీరలు, చిల్డ్రన్ వస్త్రాలు, షూస్, చెప్పల్స్, ఇతర పరికరాలు పండగల సమయంలో ఆఫర్లలో విక్రయిస్తుంటారు.వాటిని ప్రజలు తక్కువకు వస్తుందని కొనుగోలు చేస్తారు. ఇది ప్రతి ఏడాది జరిగే ప్రక్రియే.ఎమ్మార్పీ రూ.2 వేల చూపించి రూ.500 లకే ఇచ్చేస్తారు. ధరలో అంత వ్యత్యాసం ఎలా ఉంటుంది.వ్యాపారుడు ఏమైనా మన తాతా.. బంధువా..లేదంటే అన్నా తక్కువక ఇవ్వడానికి. దిగుమతి అయ్యే ఖర్చు కంటే ఆఫర్ ఎలా సెట్ అయ్యిందంటే దానికి కొంత మంది నిష్ణాతులు ఇలా చెబుతున్నారు. వస్తువు తయారీకి అయ్యే ఖర్చుపై ఎట్టి పరిస్థితుల్లోను మార్జిన్ అమౌంట్ వేసుకోకుండా విక్రయాలు జరగవు.. ఆఫర్ ఇచ్చిన వస్తువు స్టాక్ లేకుండా విక్రయాలు చేస్తే పెట్టుబడిపై వంద శాతం లాభం వస్తుంది అదే ఆలస్యం అయ్యే కొద్దీ లాభం తగ్గించుకుని అంటే రూ.100 వచ్చే చోట రూ.60 వచ్చేలా ప్లాన్ చేసుకుని డిస్కౌంట్ ఆఫర్లు పెడతారనేది నమ్మశక్యం కాని నిజం. పెద్ద ఎత్తున స్టాక్ మిగిలిపోయిన వస్తువులకు ఆఫర్లు ఇచ్చి సరుకును తోసేస్తారట.. ఎంత ఆఫర్ ఇచ్చినా కంపెనీలకు గిట్టుబాటు అవుతుందనే చెబుతున్నారు. ముంబై, సూరత్ తదితర ప్రాంతాల నుంచి తక్కువ ధరలకు సరుకును దిగుమతి చేసుకుని దానిపై పది రెట్లు మార్జిన్ వేసుకుని వ్యాపారాలు చేస్తుంటారు. అందువల్ల ఆఫర్లు విచిత్రంగా ఉంటాయి.ఒకటి కొంటే మరొకటి ఉచితమంటే కాస్త ఆలోచించాల్సిందే మరి..

### కొనుగోలుదారుల క్యూ

రాజమహేంద్రవరం అంటే వస్త్రాలు, గోల్డ్, సిల్వర్ ఇలా ఒకటేమిటి.. వ్యాపారాలకు అంతే లేదు. పెద్ద పెద్ద మాల్స్.. కంపెనీ దుకాణాలు.. ఏది కావాలంటే..ఎంతలో కావాలంటే అంతలో కావాల్సిన వస్తువులు లభ్యమవుతాయి.దీంతో ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచే కాకుండా ఇటు శ్రీకాకుళం,అటు విజయవాడలో స్థిరపడిన గోదావరి జిల్లా ప్రజలు షాపింగ్‌కు వస్తారు. అందుకే డిసెంబర్ మొదలుకొని, జనవరి పండగ వరకూ ఇక్కడ వ్యాపారాలు పెద్ద ఎత్తున జరుగుతాయి. డిసెంబరు నుంచి జనవరి మూడో వారం వరకు

## ఊదరగొడుతున్న పండుగ ఆఫర్లు

వ్యాపారం తారాస్థాయిలో ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని వ్యాపార సంస్థలు పోటాపోటీగా ఆఫర్లు ప్రకటిస్తున్నాయి.డిస్కౌంట్లు ఇచ్చేస్తున్నాయి.ఒకటి కొంటే ఒకటి ఉచితం,రూ.2 వేల విలువైంది రూ.999లకే, టీ షర్టులు రూ.200, రూ.3 వేల చీర రూ.వెయ్యిలకే, రూ.10 వేలు కొనుగోలుపై 30 శాతం, కొన్ని రకాల వస్త్రాలపై 70 శాతం, ఎంత కొంటే అంతా ఫ్రీ..బంగారు ఆభరణాలపై తరగు మజూరి రాయితీ లు, వెండి,బంగారు క్వాయిన్లు గిఫ్ట్,గ్రాముకు రూ.300 తగ్గింపు ఇలా ఆఫర్లు,ఎలక్ట్రానిక్స్ గూడ్స్‌పై 30 నుంచి 50 శాతం వరకు డిస్కౌంట్లు ఇలా ప్రతి వస్తువుపై ఆఫర్లు పెట్టి వినియోగదారులకు వ్యాపార సంస్థలు వల వేస్తున్నాయి.పండగల ఆఫర్లకు ఎదురుచూసే వారుండడంతో ప్రస్తుతం వ్యాపారం కుమ్మేస్తున్నారు.ఎందుకంటే కొను గోలుదారులు చవక అంటే పరుగులు తీస్తారు.ఒక వ్యాపారి మాట్లాడుతూ 50 రోజుల పాటు జరిగే వ్యాపారంతోనే రాజమహేంద్రవరంలో ఏడాదంతా నడుస్తాయని చెప్పడం కొసమెరుపు.రాజమహేంద్రవరంలో సుమారు వెయ్యి కోట్ల వ్యాపారం సాగుతుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇతర ప్రాంతాల నుంచి రాజమహేంద్రవరం మార్కెట్‌కు వచ్చే వారి కార్లతో పుష్కరాలరేవు నుంచి గోదావరి బండ్ రోడ్డు నిండిపోతుందంటే ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

- ఫ్రీ అంటే ఎగబడుతున్న జనం
- రూటు మార్చిన వ్యాపారులు
- ప్రతి షాపు వద్ద హోర్డింగ్‌లు
- రాజమండ్రి వైపు అందరి చూపు
- నెల రోజులుగా పెరిగిన వ్యాపారం
- కోట్లాది రూపాయల లావాదేవీలు
- కిక్కిరిసిపోతున్న మార్కెట్



కొనుగోలుదారులతో బుధవారం కిక్కిరిసిన రాజమహేంద్రవరం మెయిన్ మార్కెట్

### ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు తత్కాల్ అడ్మిషన్లు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో అడ్మిషన్లుకు గురువారం నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు అవకాశం ఇచ్చి నట్టు ఏపీ సార్వత్రిక విద్యాపీఠం సంచాలకులు తెలిపారు.ఈ మేరకు డీఈవో వాసు దేవరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక పీఠం అమ రావతి ఆధ్వర్యంలో అడ్మిషన్లు స్వీకరిస్తార న్నారు.సాధారణ అడ్మిషన్ ఫీజులకు అద నంగా తత్కాల్ ప్రవేశ రుసుం రూ.600 చెల్లించాలన్నా రు.విద్యార్థులు తత్కాల్ గడు వు ఉపయోగించుకుని ప్రవేశం పొందాల న్నారు. మరిన్ని వివరాలకు కోటగుమ్మం వద్దగల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

బీజేపీలో చేరిన కంబాల
కండువా కప్పిన పురందేశ్వరి
వివాహితను కాపాడిన మహిళా రక్షక్ టీం
సంక్రాంతికి గుంతల్లేని రహదారులు : దుర్గేష్
8


తాళ్లపూడి: విద్యార్థులకు బహుమతులు అందజేత


చాగల్లులో విశ్వాసుల ఊరేగింపు


ఎమ్మెల్యే ముప్పిడికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ బావన


కొవ్వూరు మెరకవీధి సెయింట్ పాల్స్ చర్చిలో క్రిస్మస్ ప్రార్థనలు


ఉండ్రాజవరం లూథరన్ చర్చి వద్ద క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు

# ప్రతి ఒక్కరూ సేవా మార్గంలో నడుచుకోవాలి

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ● ఘనంగా క్రిస్మస్ వేడుకలు. ప్రత్యేక ప్రార్థనలు

కొవ్వూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలను అనుసరిస్తూ ప్రతిఒక్కరూ సేవా మార్గంలో నడుచుకోవాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణంలోని మెరకవీధి లూథరన్ చర్చిలో బుధవారం జరిగిన క్రిస్మస్ వేడుకలలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చర్చి ఫాస్టర్ రెవ. జి.రాజన్‌బాబు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నీవలె నీ పొరుగు వారిని ప్రేమి స్తూ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని క్రీస్తు బోధనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, క్లస్టర్ ఇంచార్జి పెనుమాక జయరాజు, క్రైస్తవ సోదర, సోదరీమణులు, సంఘస్తులు పాల్గొన్నారు.

● క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కొవ్వూరు, పట్టణ, మండలంలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బుధవారం క్రీస్తు జన్మదినం క్రిస్మస్‌ను పురస్కరించుకుని పట్టణ, మండలంలోని వివిధ ప్రాంతాలలో చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రిస్మస్ ట్రీలు, వెల్‌కం బోర్డులు, విద్యుత్ తోరణాలు, నక్షత్రాలతో చర్చిలను ముస్తాబు చేశారు. కొవ్వూరు పట్టణం 4వ వార్డులోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో ఫాస్టర్ రెవ. గెల్లా. రాజన్‌బాబు ఆధ్వర్యంలో ముఖ్య ప్రసంగీకులు నిడదవోలుకు చెందిన ఫాస్టర్ వి. దేవదాసు క్రీస్తు సందేశాలను అందజేశారు. కొవ్వూరు గాయత్రి థియేటర్ రోడ్డులో ఉన్న క్రైస్ట్ లూథరన్ టౌన్ చర్చిలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణ, మండలంలోని అన్ని చర్చిలలో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో సంఘస్తులు చర్చిలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలతో క్రీస్తును ఆరాదించారు.

### విద్యార్థులకు నగదు పురస్కారం

**తాళ్లపూడి:** మండలంలోని పలు గ్రామాలలో బుధవారం కిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పైడిమెట్ట గ్రామంలో నందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సంస్థ తరుపున నిర్వహించిన పలుసేవా కార్యక్రమాలలో 2023-24లో తాళ్లపూడి ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం అందించి సత్కరించారు. సంస్థ ప్రతినిధి రవి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేడుకలతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. షేక్‌ఆలీ, కొడమంచిలి చంద్రశేఖర్, దున్నా విల్సన్, కొప్పాక రవి, పోసియ్య పాల్గొన్నారు.

**ఉండ్రాజవరం:** మండలంలో బుధవారం అన్ని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారంరాత్రి నుంచే వేడుకలను ప్రారంభించారు. తెల్లవారు జామున కొన్ని గ్రామాల్లో క్రీస్తు నేడు పుట్టెను అంటూ గీతాలను ఆలపించి, సువార్తను ప్రకటించారు. చర్చిలను సుందరంగా అలంకరించారు. బుధవారం చర్చిలలో క్రిస్మస్ గీతాలను ఆలపించారు. పాస్టర్లు యేసుక్రీస్తు జన్మదినం గురించి బోధించారు. క్రిస్మస్ కేక్‌లను కట్ చేశారు. మండల కేంద్రమైన ఉండ్రాజవరంలోని లూథరన్, బైబిల్ మిషన్, క్రీస్తు సంఘం, ఆర్‌సీఎమ్, పెంతుకొస్తు తదితర చర్చిలలో క్రిస్మస్ ఆరాధనలు చేశారు. పాలంగి జీడీపీఎఫ్ చర్చి ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో భారీ క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. చిన్నారులు నృత్యాలు ఆకట్టుకున్నాయి.

**నల్లజర్ల:** నల్లజర్ల మండలంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం చీపురుగూడెం విన్ ఆఫ్ ప్రేయర్ హౌస్ లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాస్టర్ మరపట్ల జోజి మాట్లాడుతూ మానవుల పాప విమోచన కోసం మానవ రూపంలో పరిశుద్ధిగా జన్మించి లోక రక్షకుడిగా యేసు క్రీస్తు అవతరించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్‌ను చిన్నారులతో కట్ చేయించి స్వీట్లు పంచారు. అదేవిధంగా పోతవరం, సుభద్రపాలెం, అనంతపల్లి, నల్లజర్ల, దూబచర్ల, ప్రకాశరావుపాలెం, ఆవపాడు గ్రామాల్లో ఘనంగా జరిగాయి.

### ప్రపంచ శాంతిధూత ఏసుక్రీస్తు.

**గోపాలపురం:** ఏసుక్రీస్తు ప్రపంచానికి శాంతిధూత అని పెద్దగూడెం సెయింట్‌థామస్ లూథరన్ చర్చ్ పాస్టర్ బి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో క్రిస్మస్ పర్వదినాన్ని బుధవారం ఘనంగా జరుపుకు న్నారు. విశ్వాసులు క్రీస్తు గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలుచేశారు. ఈ సందర్భంగా కేకును కట్‌చేసి విశ్వాసులకు పంచారు. పెద్దగూడెంలోని సేయింట్ థామస్ లూథరన్ చర్చ్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు నృత్యాలు ప్రదర్శించారు. అనంతరం పాస్టర్ డాక్టర్ బి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ఏసుక్రీస్తు పరితపించారని అన్నారు.

**చాగల్లు:** మండలంలో క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పండుగను వేడుకగా జరుపుకున్నారు. చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చాగల్లు యంగ్‌మెన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఐక్యక్రిస్మస్ వేడుక జరిగింది. ఉదయం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి జరిగిన వేడుకల్లో దైవప్రసంగీకులు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతివారు యేసు క్రీస్తు బోధనలను ఆచరిస్తూ జీవించాలన్నారు. సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, పాస్టర్ జాన్ బాబు, వెంకటరావు, టి.సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

**దేవరపల్లి:** మండలంలోని అన్నిచర్చిలలో ప్రత్యేకంగా విద్యుత్‌కాంతులతో అలంకరించారు. అన్ని ప్రార్థనాలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తెల్లవారు జామున అన్ని గ్రామాల్లోనూ ఏసుక్రీస్తు నేడు పుట్టెను అంటూ గ్రామాల్లో ఏసుక్రీస్తు విశ్వాసులు పురవీధుల్లో తిరిగారు. ఏసు క్రీస్తు కీర్తనలు అలపించారు. చర్చ్‌లలో బుధవారం రాత్రి కేకులు కట్ చేశారు. మండలంలోని రామన్నపాలెం సునీత ఆంథోని ఆర్‌సీఎం దేవాలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. గౌరీపట్నం, దేవరపల్లి, యర్నగూడెం, గ్రామాల్లో ఉన్న చర్చిలను అలంకరించారు.


దేవరపల్లి: ప్రత్యేక విద్యుత్‌కాంతులతో రామన్నపాలెం సునీత ఆంథోని చర్చి


గోపాలపురం: పెద్దగూడెం సెయింట్ థామస్ చర్చిలో సందేశం ఇస్తున్న పాస్టర్ ప్రవీణ్‌కుమార్


నల్లజర్ల: చీపురుగూడెంలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ జోజి


కంబాల శ్రీనివాసరావుకు పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించి మాట్లాడుతున్న దగ్గుబాటి పురందేశ్వరి

# పేదలకు అండగా ఉండే పార్టీ బీజేపీ

● రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

● బీజేపీలో చేరిన రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు

గోకవరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వాల సంఖ్య సుమారు 25 లక్షలకు చేరుకుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గోకవరం-తంటికొండ రోడ్డులోగల సీఎండీ లే అవుట్ ప్రాంగణంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస రావు సుమారు 10 వేల మందితో కలిసి బుధవారం పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె ముందుగా మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు అన్ని విధాలా న్యాయం చేసే పార్టీ బీజేపీ అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో సుపరిపాలన అందడం వల్లే దేశ ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. దేశ ప్రజలంతా వాజ్‌పేయి అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. హైందవ ధర్మాన్ని కాపాడేందుకు విజయవాడలో చేపట్టనున్న హైందవ శంఖారావం కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలన్నారు. రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు చేరికతో స్థానికంగా బీజేపీ మరింత బలోపేతం అవుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ అధిక సంఖ్యలో దళితుల చేరికలు పార్టీ ప్రతిష్టతకు దోహదపడతాయన్నారు. రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ 2022వ సంవత్సరం నుంచి రామసేన ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వాజ్‌పేయి జయంతి, క్రిస్మస్ వేడుకల నడుమ బీజేపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటి వరకు నియోజక వర్గంలో 36 వేల సభ్యత్వాలు చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచానన్నారు. స్థానికంగా ఉన్న హిందే దేవాలయాల అభివద్ధికి రూ.కోటి విరాళాలు ఇచ్చానన్నారు. రాబోయే రోజుల్లో పార్టీలో తనకు ఏవిధమైన బాధ్యత అప్పగించినా క్రమశిక్షణ కల్గిన సైనికుడిలా పనిచేస్తానన్నారు. సభకు సుమారు 15 వేల మందికిపైగా జనం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. వీరందరికీ నిర్వాహకులు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకుడు సోము వీర్రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశి విశ్వానాథరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేలు కూరి సూర్యనారాయణరాజు, రేలంగి శ్రీదేవి, కోడూరి లక్ష్మీనారాయణ, కాకినాడ పార్లమెంట్ అధ్యక్షుడు చెరుకూరి రామ్‌కుమార్, నాయకులు మట్టా మంగరాజు, సత్తి వెంకటరెడ్డి, సభ్యులు తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్ప,ఇనగోటి బాపన్న దొర తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు న్యాయం చేయాలని వినతి

కొవ్వూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పైడిమెట్ట రోడ్డు ప్రమాద బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు ఎస్సీ వర్గీకరణ జేఏసీ జిల్లా చైర్మన్ కొడమంచిలి రమణ కోరారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. తాళ్లపూడి మండలం పైడిమెట్ట గ్రామ సమీపంలో అక్టోబరు 8న రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో బల్లిపాడు గ్రామానికి చెందిన చదలవాడ రామారావు అతని కుమారుడు ఇద్దరు గాయాలపాలయ్యారు. బాధితురాలికి ఇప్పటివరకు ఎటువంటి న్యాయం జరగలేదని, న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈకార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు.

## కాపు నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం కల్చరల్ డి సెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): కాపు విద్యార్థులు ఉద్యోగావకాశాలు పొందడానికి ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్టు కాపునాడు ఉమ్మడి గోదావరి జిల్లాల అధ్యక్షుడు గుదే రఘు నరేష్ తెలిపారు. కాపునాడు వ్యవస్థాపకుడు మిరియాల వెంకట్రావు జయంతిని పురస్కరించుకుని బుధవారం దేవీచౌక్‌లోని కాపునాడు కార్యాలయంలో నివాళులర్పించారు. కాపు విద్యార్థులకు ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, రైల్వే, బ్యాంక్, సివిల్ సర్వీసెస్‌కు ఉచి తంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలి పారు. ఆసక్తి గల కాపు విద్యార్థులు జి.రఘు,సెల్ నెం.9397950465ను సంప్రదించాలని తెలి పారు. ఈ కార్యక్రమంలో బాలు కృష్ణనాయుడు,ముమ్మిడి వీరబాబు,విన్నా వాసు,దేశినీడి రాంబాబు,కాళ్ళ చక్రరావు,డి.చక్రపాణి తదితరుల పాల్గొన్నారు.

# శాంతియుత సమాజానికి కృషి చేసిన వాజ్‌పేయి

నివాళులర్పించిన మంత్రి దుర్గేష్

నిడదవోలు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజకీయం, సాహిత్యాన్ని సమపాళ్లలో నడిపించిన నాయకుడు భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకుని నిడదవోలు చర్ల సుశీల వృద్ధాశ్రమంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ ఆధ్వర్యంలో వృద్ధులకు బట్టలు పంపిణీ చేశారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో శాంతియుత సమాజానికి కృషి చేశారని, అన్నిమతాలను సమానంగా గౌరవించారన్నారు. దేశ వ్యాప్తంగా నేషనల్ హైవేలను 4, 6 లైన్ల రహదారులు, ఆర్‌వోబీలకు ఆద్యుడన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, బీజేపీ నాయకులు ఎం. సత్యనారాయణ, నీలం రామారావు, రంగా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### వాజ్‌పేయి శత జయంతి

**కొవ్వూరు:** భారత మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి 100వ జయంతి వేడుకలను కొవ్వూరు బీజేపీ నాయకులు నిర్వహించారు. బుధవారం కొవ్వూరు మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బోడపాటి ముత్యాలరావు, మాట్ల ఆంజనేయులు, కరుటూరి జగన్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

### వాజ్‌పేయికి నివాళి

**ఉండ్రాజవరం:** మండల కేంద్రమైన ఉండ్రాజవరంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి బుధవారం పూలవవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ చిట్టూరి సాయిబాబు, స్థానికులు బి.షర్మిళ, ఆకెళ్ల శ్రీనివాసరావు, వై.భాస్కరరావు, వైపే నారాయణ, అక్కిన శ్రీరాములు, ఎమ్‌డి రియాజ్ తదితరులు పాల్గొన్నారు.


నిడదవోలులో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మంత్రి దుర్గేష్


కొవ్వూరులో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

## సంక్రాంతికి గుంతల్లేని రహదారులే లక్ష్యం

● మంత్రి దుర్గేష్

నిడదవోలు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా సంక్రాంతి నాటికి గుంతలులేని రహదారులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు పట్టణంలో రోడ్డు మరమ్మతు పనులకు బుధవారం మంత్రి దుర్గేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ సుమారు రూ.45 లక్షల అంచనా వ్యయంతో రోడ్డు మరమ్మతులకు శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే నియోజకవర్గానికి రూ.11 కోట్లు నిధులు తీసుకువచ్చామని, రాబోయో రోజులలో నిడదవోలు పట్టణాన్ని అన్నిరంగాలలోను ముందుకు తీసుకువెళ్తామన్నారు. సీసీ రోడ్లు ఎక్కడెక్కడ అవసరమో గుర్తించి వాటిని నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. మరో 4 లేక 5 నెలల్లో రూ.30 కోట్లతో రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్‌చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, కమీషనర్ కృష్ణవేణి, డీఈ హరిబాబు, కూటమి నేతలు కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, బండి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


నిడదవోలులో మంత్రి దుర్గేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న చైర్మన్ భూపతి ఆదినారాయణ, కొమ్మిన వెంకటేశ్వరరావు



# సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ


సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలలో మీకు కష్టం ఎదురైనప్పుడు, మీ కుటుంబాన్ని పెద్ద కొడుకులా ఆదుకుంటానని చంద్రబాబు ఇచ్చిన మాటను సీఎం సహాయనిధి ద్వారా ఆసుపత్రి ఖర్చులకు ఆర్థిక సహాకారం అందిస్తూ నిలబెట్టుకుంటున్నట్లు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని టీడీపీ కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. చాగల్లు మండలం కలవలపల్లి గ్రామానికి చెందిన కారింకి దుర్గారావుకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.57,522ల చెక్కును ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన వ్యక్తులతోనే ఆనందమయ సమాజం, అత్యుత్త మ అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కుటుంబంలో ఒకరు అనారోగ్యం పాలైతే కుటుంబం మొత్తం కలత చెందుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవ కింద పేద ప్రజలకు వైద్యసేవలు అందిస్తుంది. ఎన్టీఆర్ వైద్య సేవలో లేని వ్యాధులకు ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్న వారికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, ఆళ్ల హరిబాబు, నాదెళ్ళ శ్రీరామ్, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

### వంగవీటి రంగా విగ్రహావిష్కరణకు తరలిరండి

నల్లజర్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అనంతపల్లిలో గురువారం నిర్వహించే వంగవీటి మోహన రంగా, శ్రీ కృష్ణదేవరాయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గంలో కాపు సోదరులు, రంగా అభిమానులు తరలిరావాలని అనంతపల్లి రంగా మిత్రమండలి కాపు సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, కరాటం రాంబాబు విచ్చేస్తున్నట్లు చెప్పారు.

### ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడికి పరామర్శ

తాళ్లపూడి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఏపీటీఎస్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు మాతృమూర్తి దున్నా వీరమ్మ ఇటీవల మృతి చెందారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల బుధవారం పైడిమెట్టలోని దుర్గారావు నివాసం వద్ద దున్నా వీరమ్మ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్‌రాజు, షేక్ జిలానీ, కేఏస్ రమ పాల్గొన్నారు.

# వివాహితను రక్షించిన మహిళా రక్షక్ టీం


వివాహితను కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తరచు తాగి వచ్చి భర్తపెడుతున్న వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుందామని రాజమహేంద్రవరం వచ్చిన ఒక వివాహితను జిలా మహిళా రక్షక్ టీం రక్షించింది. రాజమహేంద్రవరం గౌతమి ఘాట్ వద్ద మంగళవారం రాత్రి మండపేటకు చెందిన ఒక వివాహిత ఏడుస్తూ మహిళా రక్షక్ టీమ్‌కు కనిపించింది. దీంతో వెంటనే టీం స్పందించి ఆ వివాహితను అక్కున చేర్చుకుని వివరాలు అడగడంతో ఆమె బాధ చెప్పుకుంది. వివాహం జరిగి ఎనిమిదేళ్ల అయింద ని.. ఇద్దరు పిల్లలు ఉన్నారని.. తన భర్త వేధింపులు తాళలేక చనిపోదామని రాజమహేంద్రవరం వచ్చానని తెలియ జేసింది. దీంతో స్పందించిన రక్షక్ టీం ఎస్పీ నరసింహకిషోర్ కు సమాచారం ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు స్టేషన్‌కు తరలించి రక్షక్ టీం ఇన్‌చార్జి మంగాదేవి వివాహిత భర్త, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బుధవారం వారిని స్టేషన్‌కు రప్పించి కౌన్సిలింగ్ ఇచ్చారు.అనంతరం ఆమెను కుటుంబీకులకు అప్పగించారు. వివాహి తను రక్షించిను రక్షక్ టీమ్‌ను జిల్లా ఎస్పీ అభినందించారు.

# క్రికెట్ ప్లేయర్ అనిల్‌కు సాయం అందజేత


అనిల్‌కుమార్‌కు చెక్కును అందిస్తున్న యువగళం టీం

తాళ్లపూడి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ అంటే ప్రాణం ఆర్థికంగా అంతంత మాత్రమే అయినా ఇటీవల జరిగిన పోటీలలో ప్రతిష్ఠాత్మక ఇండో నేపాల్ టెన్నిస్ బాల్ క్రికెట్ సిరీస్‌లో స్థానం సంపాదించాడు కొండే అనిల్ కుమార్. మండలంలోని అన్నదేవరపేట గ్రామానికి చెందిన కొండే అనిల్‌కుమార్ ఆటలో మేటి, కానీ ఆర్థికంగా వెనుకబడి ఉన్నాడు. ఈనెల 28న గోరఖ్‌పూర్ వెళ్లి అసోసియేషన్‌లో రిపోర్టు చేయాల్సి ఉంది. ఇండియా తరుపున ఆడేందుకు ప్రయాణ, వసతికి లక్షలలో అయ్యే ఖర్చుకు దాతల నుంచి ఆర్థిక సహాయంకోసం ఎదురుచూస్తున్న అనిల్‌కుమార్‌కు టీడీపీ యువగళం టీం రూ.50 వేలను ఆర్థిక సహాయాన్ని అందించారు. తాళ్లపూడి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నుంచి 6వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో యువగళం టీం జీవీ ప్రసాద్, కూచిపూడి లక్ష్మణరావు, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, అకంసాని ఆదిత్య, తొండెపు భరత్, మానవతా సభ్యులు అంకెం సురేష్‌కుమార్, సనపల రాజశేఖర్, అప్పన హనుమంతరావు, ఇంజరపు అబ్బులు, టీఎస్‌బీ గుప్త తదితరులు పాల్గొన్నారు.